

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

సంపుటి : 4 | సంచిక : 314 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 28-05-2025 | పేజీలు : 6



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690


# తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత

- పార్టీకి ప్రాణం, ఆయుధం కూడా కార్యకర్తలే
- కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వం, అండగా ఉంటాం
- అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్
- 'స్టేట్ ఫస్ట్' మన సంకల్పం- 'పాజిటివ్ పాలిటిక్స్' మన విధానం
- బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ఏకైక పార్టీ టీడీపీనే
- 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించాం
- 1982 నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకు మనది రాజీలేని పోరాటం
- కడప మహానాడు తొలిరోజు ప్రసంగంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు
- వచ్చే ఎన్నికల్లో కడపలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు గెలుద్దామని పిలుపు



**కడప, మే 27 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కార్యకర్తలే టీడీపీకి అసలు సిసలైన అధినేతలని, పార్టీకి ప్రాణం-ఆయుధం కూడా కార్యకర్తలేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విధ్వంస పాలకులను ఎదురొడ్డి పోరాడిన కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వమని, వారికి అండగా ఉండి సంక్షేమం అందిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్ అని, రాష్ట్రం ఫస్ట్ మన సంకల్పమని, పాజిటివ్ పాలిటిక్స్ మన విధానమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక ప్రాంతీయ పార్టీగా 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించిన ఏకైక పార్టీ తెలుగుదేశమన్నారు. 1982లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు... నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటంచేశామన్నారు. మంగళవారం కడపలో జరిగిన మహానాడు తొలిరోజు సమావేశంలో ప్రారంభోపన్యాసాన్ని జై తెలుగుదేశం, జోహార్ ఎన్టీఆర్ నినాదాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుపెట్టారు. అంతకుముందు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, జ్యోతిని వెలిగించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగించారు.

**ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది :**

ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడు అంటే అదే జోరు. అదే హోరు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే నా మనసు ఉప్పొంగుతోంది. నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులందరికీ స్వాగతం. దేశంలో అనేక రాజకీయ పార్టీలున్నాయి. మహానాడులా వేలాది మంది ప్రతినిధులతో మంచిచెడులు, విధానాలు, ఆలోచనలు చర్చించుకునే ఏకైక పార్టీ మాత్రం తెలుగుదేశమే. రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిగా ఉండేది. తొలిసారి దేవుని కడపలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి మహానాడు కడపలో ఏర్పాటు చేశాం. కడప గడ్డపై ఈ మహానాడు చూస్తుంటే ఎన్నికలు అయ్యి ఏడాదైనా కార్యకర్తల్లో ఆ కసి, ఉత్సాహం, ఉద్వేగం ఏమాత్రం తగ్గలేదు. ఉమ్మడి కడపలో 10 కి ఏడు స్థానాలు గెలిచి సత్తాచాటాం. ఈసారి మరింత కష్టపడితే 10కి 10 మనవే. ఇప్పటి వరకూ మనం 34 మహానాడులు జరుపుకున్నాం. ఈ మహానాడు సువర్ణాక్షరాలతో చరిత్ర సృష్టించబోతోంది. ఏపీ ఆర్థిక పరిస్థితికి దశ దిశ నిర్దేశిస్తుంది. గతంలో మహానాడు అంటే ఎండలు మండేవి. ఈసారి చల్లటి వాతావరణంలో మహానాడు జరుగుతోంది.

**కార్యకర్తల పోరాట ఫలితమే ఈ అద్భుత విజయం :**

2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయం అసామాన్యం. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో చరిత్ర సృష్టించామంటే అందుకు పసుపు సైనికుల పోరాటం, త్యాగాలే కారణం. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం ఈ మహా విజయానికి దోహదం చేసింది. ఏమీ ఆశించకుండా దశాబ్దాలుగా గ్రామాల్లో జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడ ఉన్నాం. దీన్ని ప్రతి నేత కూడా గుర్తుంచుకోవాలి. 43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలు ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందని మాట్లాడినవారి పనే అయిపోయింది కానీ టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది. నాటి ఎన్టీఆర్ చైతన్య రథం, నేను చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్ర, లోకేష్ యువగళం వరకూ కార్యకర్తల్లో అదే స్ఫూర్తి.

**గొంతు కోసినా జై తెలుగు దేశం అన్నారు :**

పాలన అంటే హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, వేధింపులు, తప్పుడు కేసులుగా గత పాలకులు మార్చారు. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. దీన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వెంటాడి వేటాడి ప్రాణాలు తీశారు. అక్రమ కేసులు పెట్టి వేధించారు. కానీ ఒక్క కార్యకర్త కూడా ఎత్తిన జెండా దించలేదు. ప్రశ్నించినవారి గొంతు నొక్కేందుకు గొంతులు కోశారు. మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశమని ప్రాణాలు వదిలాడు. ఎందరో కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వారి స్ఫూర్తి టీడీపీలో శాశ్వతంగా ఉంటుంది. ఎత్తిన జెండా దించని కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు మహానాడు వేదికగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ త్యాగాలు వృథా కానివ్వం. కార్యకర్తల కష్టాలను గుర్తిస్తాం. సంక్షేమం అందిస్తాం. వర్షాలు వస్తున్నా మహానాడు జయప్రదం చేయాలని వచ్చిన కార్యకర్తలను చూస్తుంటే ఆనందంగా ఉంది.

**పాలనలో టీడీపీ ట్రెండ్ సెట్టర్ :**

దేశంలో అనేక పార్టీలు ఉన్నాయి. కానీ ప్రజల జీవితాలను ఇంతలా ప్రభావితం చేసిన పార్టీ మాత్రం టీడీపీనే. అటు తెలంగాణ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకూ అభివృద్ధి అంటే టీడీపీ ఆవిర్భావం ముందు, తర్వాతగా చూడాలి. ఇది చరిత్ర చెప్పిన వాస్తవం. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్. టీడీపీ పాలనే బ్రాండ్ అంబాసిడర్. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి ఆడబిడ్డల ఆస్తి హక్కు వరకూ, బాలికా విద్యకు ప్రోత్సాహం నుంచి ప్రత్యేక మహిళా వర్సిటీ వరకూ, లోటు కరెంటు నుంచి మిగులు విద్యుత్ వరకూ రూ.2కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకూ, రూ.30 పింఛను నుంచి రూ.4 వేల పింఛను వరకూ, వంట కష్టాలను దీపం పథకం తప్పించడం నుంచి డ్వాక్రా సంఘాల సాధికారత వరకూ నిరుద్యోగ పరిస్థితులను నుంచి ఐటీ ఉద్యోగాలతో విదేశాల్లో సత్తా చాటే వరకూ, సీమలో రైతుల సాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి నుంచి డ్రిప్ సబ్సిడీలతో సిరులు పండించే వరకూ, బడుగు బలహీన వర్గాలకు అధికారం చూపిన తొలి పార్టీ టీడీపీ. అడిగే పరస్థితి నుంచి బీసీలు శాసించే పరిస్థితికి తెచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి. మనందరం టీడీపీ రాజకీయ పాఠశాలలో విద్యార్థులమే.

**నేను నిత్య విద్యార్థిని :**

నేను నిత్య విద్యార్థిగా ఉంటాను. ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు ఉపయోగపడతాను. కార్యకర్తలే నాకు ఆయుధాలు. మీరు నేనూ కలిస్తే ఆకాశమే హద్దుగా పనిచేయొచ్చు. పాజిటివ్ పాలిటిక్స్ మన విధానం, రాష్ట్రం ఫస్ట్ అనేది మన సంకల్పం. ప్రతిపక్షంలో అవినీతిపై పోరాడాము. అధికారంలోకి రాగానే అవినీతి రహిత పాలన అందిస్తున్నాము. ప్రజల ఆస్తులు, ప్రజల హక్కులకు రక్షణ కల్పించాం. ఇకపైనా చేస్తాం. భావితరాల భవిష్యత్‌కు అవసమైన పాలసీలు తెచ్చాం. పాజిటివ్ పాలటిక్స్ తో రాజకీయాల్లో విలువలు పెంచిన పార్టీ టీడీపీనే. నేడు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారంటే అదీ మన సత్తా. మనది మోస్ట్ సక్సెస్ ఫుల్ మోడల్. ప్రజలిచ్చిన తీర్పును ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలకే ఉపయోగించాం. సొంత అవసరాలకు వాడలేదు. వాడము. అదే టీడీపీ చిత్తశుద్ధి. మన పార్టీ విధానాలు, మన ఆలోచనలు దేశంలో ఇతర పార్టీలకు బ్లూ ప్రింట్‌గా నిలిచాయి.

**సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం :**

రాజకీయాల్లో సామాజిక న్యాయం టీడీపీ తెచ్చిన అతిపెద్ద విప్లవం. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇచ్చాం. 40 ఏళ్లకు ముందే బీసీలను రాజకీయాల్లో భాగస్వాములు చేశాం. ఇదే టీడీపీని తిరుగులేని శక్తిగా మార్చింది. మన తర్వాత దేశంలో అన్ని పార్టీలు బీసీలను గుర్తించే పరిస్థితి వచ్చింది. సంస్థాగతంగా దేశంలో బలమైన పార్టీ టీడీపీ. ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టి కోటి సభ్యత్వాతలను 45 రోజుల్లోనే పూర్తి చేసిన ఏకైక పార్టీ టీడీపీ.

**జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర :**

జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల్లో టీడీపీ కీలక పాత్ర పోషించింది. వాట్ ఏపీ థింక్స్ టుడే... ఇండియా థింక్స్ టుమారో అనేది అనేక సార్లు నిరూపణ అయ్యింది. విద్యుత్ సంస్కరణలు, పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాలు, ప్రజల వద్దకు పాలన, జవాబుదారీ వ్యవస్థ వంటివి దేశానికి పరిచయం చేశాం. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్టీ విధానంలో నూతనత్వం తీసుకొద్దాం. కడప గడ్డపై జరుగుతున్న మహానాడులో అనేక నిర్ణయాలు చర్చించి భావితరాల భవిష్యత్‌కు కార్యక్రమ రూపకల్పన చేస్తాం. ఈ మహానాడు భవిష్యత్‌ను ఒక దశదిశా నిర్దేశించే విధంగా ఉండబోతోంది.

**అభివృద్ధికి కేరాఫ్ ఏపీ కాబోతోంది :**

స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో రాబోయే 22 ఏళ్లలో అంతకుమించి రెట్టింపు అభివృద్ధి జరగబోతోంది. 2025 మహానాడు ఒక చరిత్ర తిరగరాయబోతోంది. మంత్రి లోకేష్ ఆరు శాసనాలతో ఒక బ్లూ ప్రింట్ విడుదల చేస్తారు. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నదుల అనుసంధానం, పోలవరం పూర్తి చేసి జలహారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి తెలుగు ప్రజల రుణం తీర్చేలా తీర్మానం చేస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు నాంది పలుకుతాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటివి చేసి ప్రపంచంలోనే లాజిస్టిక్ కాస్ట్ తగ్గేలా మన ఆలోచనలు ఉంటాయి. ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్ లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ తయారుచేస్తే మనం స్వర్ణాంధ్ర 2047 తెచ్చాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ధ్యేయంగా పెట్టుకుని ప్రతి ఒక్కరి ఆదాయం రూ. 55 లక్షలు ఉండేలా కార్యక్రమం రూపకల్పన చేశాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరగాలి. 2047 నాటికి జీరో పావర్టీ సాధించి దేశానికి ఒక దశదిశ నిర్దేశిస్తాం. ఆ తర్వాత పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించే విధానానికి శ్రీకారం చుడతాం. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం మన విధానం. రాబోయే పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే కాదు మనం అనుకున్న విధానాలు అమలు చేసి వ్యవస్థనుగాడిలో పెట్టే బాధ్యత నాది. ప్రపంచంలోనే తెలుగు జాతి నెంబర్ వన్ గా చేసే బాధ్యత మనందరిదీ.

**అవినీతిపై రాజీలేని పోరాటం :**

చరిత్ర ఒకసారి చూస్తే కొన్ని కీలక అంశాలపై అందరికీ అవగాహన ఉండాలి. రాజకీయ అవినీతిని ప్రజలు పట్టించుకోరనేది అపోహ మాత్రమే. అవినీతిపై టీడీపీ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాల ప్రయాణంలో అవినీతిపై రాజకీయ లేని పోరాటం చేసిన పార్టీ టీడీపీ. ఉమ్మడి రాష్ట్రంలో 1984లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటం చేసింది టీడీపీ. ఉమ్మడి రాష్ట్రంలో రాజా ఆఫ్ కరెప్షన్ అనే పేరుతో లక్షల కోట్ల అవినీతిపై టీడీపీ చేసిన పోరాటం నిజమని సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు తేల్చాయి. అదే మన విశ్వసనీయత. వాస్తవాలతో అవినీతిపై పోరాడిన పార్టీ టీడీపీ. హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు, వ్యాన్ పిక్, హిందూ, లేపాక్షి భూములపై పోరాడాం. ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై మనం చేసిన ఉద్యమం నాడు దేశంలోనే ఒక సంచలనం. ఓబుళాపురం అక్రమాలు నిజమని పదేళ్ల తర్వాత కోర్టులు గుర్తించి శిక్షలు వేశాయి. మన ప్రతి పోరాట ఫలితం నేడు కళ్లముందు కనపడుతోంది.

**విధ్వంస పాలకులను ప్రజలు తరిమికొట్టారు :**

గతంలో ప్రభుత్వాలు చేసిన అవినీతి ఒక ఎత్తయితే వైసీపీ చేసిన అవినీతి ఒక ఎత్తు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధ్వంస పాలకుల స్కాములు లెక్కబెడుతున్నాం. విచారణకు ఆదేశాలిచ్చాం. ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. ఎన్నికల్లో మనల్ని గెలిపించి అవినీతి పాలకులను ప్రజలు తరిమేశారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యత మనకిచ్చారు. ప్రజా సంపద దోచిన వారిని, గాడి తప్పిన నేతలను, అధికారులను ఉపేక్షించం. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. మనం అధికారంలోకి వచ్చి ఏడాదయింది. ఏడాది క్రితం రాష్ట్రమంతటా సంక్షోభం. ప్రజలిచ్చిన అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించాం. కేంద్ర సహకారంతో ఒక్కో ఇటుక పేర్చుతున్నాం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. 2024లో వైసీపీని ను చిత్తుచిత్తుగా ఓడించాక ఏపీ ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. ప్రజల్లో అశాంతి పోయింది. ఎవరు ఏం చేస్తారో అనే అలజడి పోయింది. చీకటి తొలగి, భవిష్యత్‌పై ఆశలు పెరిగాయి. ఓట్లేసి గెలిపించిన ప్రజల జీవితాలు బాగుచేస్తాం.

**ప్రతి ఒక్కరికీ సంక్షేమం :**

రోడ్లు, మౌలిక సదుపాయాలు, వ్యాపారాలు, పెట్టుబడులు, ఉపాధి, ఉద్యోగాలు, నోటిఫికేషన్లతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. 64 లక్షల మందికి రూ.4 వేలు, రూ.6 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలు పింఛను ఇచ్చే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఏటా రూ.33 వేల కోట్లు నేరుగా పేదల సేవలో మొదటి తారీఖున పేదలకు అదిస్తున్నాం. అన్నా క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాం. దీపం పథకంతో కోటి మందికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. ఉచిత ఇసుక, మత్సకారుల సేవలో ఆర్థికసాయం, అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు గౌరవ వేతనాలు పెంచాం. డీఎస్సీ నోటిఫికేషప్ ఇచ్చాం. స్కూళ్లు తెరిచేలోగా తల్లికి వందనం అం దిస్తాం. సీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేయడం, ఏపీలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సాహించడం చేస్తున్నాం. మిరప రైతులకు ఇబ్బంది వస్తే కేంద్రంతో మాట్లాడాం. కోకో రైతులకు ఇబ్బంది వస్తే సబ్సిడీ ఇచ్చాం. సీమలో మామిడి రైతులకు ఇబ్బంది వస్తే ఆదుకుంటున్నాం. పొగాకు రైతులను ఆదుకున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. పారిశ్రామిక వేత్తలతో నమ్మకం కల్పించి పెట్టుబడులు తెస్తున్నాం. 11 నెలల్లో 6 స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులు పెట్టి 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. దీనివల్ల రూ.4 లక్షల 96 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 4 లక్షల 57 వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. రూ.10 లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా వచ్చాయి. రూ.లక్షా 20 వేల కోట్ల బిల్లుల పెండింగ్ ఉన్నాయి. టీడీపీ మీద కక్ష గట్టి నీరు చెట్టు, నరేగా వంటి పనులకు బిల్లులు ఇవ్వలేదు. ఐటీ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్, మన మిత్ర తెచ్చాం. ఇదో గేమ్ ఛేంజర్.

**పెద్ద నోట్లు రద్దు చేయాలి :**


నేను డిజిటల్ కరెన్సీ పెట్టమని ప్రధానికి రిపోర్ట్ ఇచ్చాను. దీని వల్ల అక్రమార్కులను తేలిగ్గా పట్టుకోవచ్చని చెప్పాను. ప్రజాసేవే పరమావధిగా పని చేయాలి. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుంది. పార్టీకి డొనేషన్ ఇవ్వాలంటే నేరుగా ఫోన్ ద్వారా అకౌంట్ లోకి డబ్బు చెల్లించవచ్చు.

**సీమ ముఖచిత్రం మార్చింది టీడీపీనే :**

అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం.

మిగతాది 6లో..

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 28 మే 2025,**

**తిథి :** శుద్ధ పాడ్యమి (తె.05:07వ.కు), శుద్ధ విదియ (29తా తె.01:58 వ.కు), **నక్షత్రం :** రోహిణి (తె.02:52వ.కు), మృగశిర (29తా తె.00:31 వ.కు), **బ్రహ్మ ముహూర్తం :** తె.04:02ల తె.04:50, **రాహుకాలం :** మ.12:05ల మ.01:42, **యమగండం :** ఉ.07:15ల ఉ.08:52, **వర్జ్యకాలం :** ఉ.07:54ల ఉ.09:31

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 28 మే 2025,**

**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:31

**సూర్యోదయం :** ఉదయం గం. 05:49

**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:17

**అసర్ :** సాయంత్రం గం. 03:39

**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:45

**ఇష :** రాత్రి గం. 08:04





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# తెలుగుజాతి అణిముత్యం.. అన్న ఎన్టీఆర్

## ఎడిటోరియల్

నందమూరి తారక రామారావు, లేదా ఎన్టీఆర్, తెలుగు జాతి హృదయాలలో చెరగని ముద్ర వేసిన ఒక అసాధారణ వ్యక్తి. మే 28, 1923న కృష్ణా జిల్లాలోని నిమ్మకూరులో ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన ఎన్టీఆర్, తన అసమాన ప్రతిభ, దృఢ సంకల్పం, సమాజం పట్ల అంకితభావంతో సినిమా, రాజకీయ, సామాజిక రంగాలలో ఒక శాశ్వత దీపంగా నిలిచారు. ఎన్టీఆర్ జయంతి కేవలం ఒక వ్యక్తి జన్మదిన జ్ఞాపకం కాదుబీ ఇది తెలుగు జాతి ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వం, సామాజిక నీతులకు ఒక గొప్ప నివాళి. ఈ సందర్భంగా, ఆయన జీవితం, సాధనలు, సమాజంపై ఆయన చూపిన అపార ప్రభావాన్ని స్మరించుకుందాం.

**సినిమా రంగంలో ఒక యుగకర్త :**

ఎన్టీఆర్ సినిమా జీవితం 1949లో "మనదేశం" చిత్రంతో ప్రారంభమైంది, కానీ 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఆయనను ఒక రాత్రిలో స్టార్‌గా నిలబెట్టింది. ఈ చిత్రం ఆయన నటన, స్క్రీన్ ప్రెజెన్స్, సంభాషణల శైలిని ప్రపంచానికి పరిచయం చేసింది. "మాయాబజార్", "మిస్సమ్మ", "లవకుశ", "శ్రీకృష్ణ పాండవీయం", "దానవీర శూర కర్ణ" వంటి చిత్రాలు తెలుగు సినిమా బంగారు యుగాన్ని నిర్వచించాయి. ఎన్టీఆర్ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో తన వైవిధ్యమైన నటనతో "నటసామ్రాట్" బిరుదును సొంతం చేసుకున్నారు.

ఆయన పౌరాణిక పాత్రలలో, ముఖ్యంగా కృష్ణుడు, రాముడు, రావణుడు, భీష్ముడు వంటి పాత్రలలో నటించిన తీరు ప్రేక్షకులకు ఆ పాత్రలు జీవం పోసినట్లుగా అనిపించింది. "భక్త రామదాసు", "శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం", "అన్నమయ్య" వంటి చిత్రాలు తెలుగు సంస్కృతి, భక్తి భావనలను ప్రపంచవ్యాప్తంగా చాటాయి. ఎన్టీఆర్ కేవలం నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా తన సృజనాత్మకతను ప్రదర్శించారు. ఆయన స్థాపించిన రామకృష్ణ స్టూడియోస్, ఎన్టీఆర్ ఆర్ట్స్ వంటి సంస్థలు "సీతారామ కళ్యాణం", "గులేబకావళి కథ", "చాణక్య చంద్రగుప్త" వంటి చిరస్థాయి చిత్రాలను నిర్మించాయి.

ఎన్టీఆర్ సినిమా రంగంలో సాంకేతిక ఆవిష్కరణలకు కూడా దోహద పడ్డారు. ఆయన చిత్రాలలో ఉపయోగించిన విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్, సినిమాటోగ్రఫీ ఆ యుగంలోని సాంకేతిక పరిమితులను దాటి తెలుగు సినిమాను ఒక కొత్త స్థాయికి తీసుకెళ్లాయి. ఉదాహరణకు, "మాయాబజార్"లోని గట్టిమేలతల్లి పాత్ర, "పాతాళ భైరవి"లోని ఫాంటసీ అంశాలు ఆనాటి సాంకేతిక విన్యాసాలకు నిదర్శనం. ఆయన చిత్రాలు కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, సామాజిక సందేశాలను, నీతి విలువలను, తెలుగు సాహిత్యం, సంగీతం, నృత్య కళలను ఉద్ధరించాయి. ఎన్టీఆర్ సంభాషణల శైలి, ఆయన గంభీరమైన గొంతు ఈ రోజు కూడా యువ నటులకు, సినిమా సృష్టికర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

**రాజకీయ రంగంలో విప్లవాత్మక దార్శనికత :**

1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) స్థాపించడం ఆంధ్రప్రదేశ్



రాజకీయ చరిత్రలో ఒక యుగాంతం. "తెలుగు వారి ఆత్మగౌరవం" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ఉద్యమం, రాష్ట్ర రాజకీయాలలో కేంద్రీకృత శక్తులను సవాలు చేసింది. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే, 1983లో టీడీపీ రాష్ట్ర ఎన్నికలలో అత్యధిక సీట్లు గెలుచుకొని ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసింది. ఈ విజయం ఆయన జననాయకత్వానికి, ప్రజలతో ఆయనకున్న అనుబంధానికి, ఆయన దృఢ నిశ్చయానికి నిదర్శనం.

ఎన్టీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు, సామాజిక సంస్కరణలు అమలయ్యాయి. రూ.2 కిలో బియ్యం పథకం ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు, పరిపాలనలో సరళీకరణ వంటి నిర్ణయాలు ఆయన సంస్కరణాత్మక దృష్టికి నిదర్శనం. ఆయన పరిపాలనలో పారదర్శకత, నీతి, ప్రజల పట్ల బాధ్యత ఉట్టిపడ్డాయి. ఎన్టీఆర్ రాజకీయ జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. 1984లో రాజకీయ కుట్రలు, 1995లో పార్టీలో ఆంతరంగిక సంక్షోభం వంటి సంఘటనలు ఆయన దృఢత్వాన్ని, ధైర్యాన్ని పరీక్షించాయి. అయినప్పటికీ, ఆయన ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసం నిలబడ్డారు.

ఎన్టీఆర్ రాజకీయ దృష్టి కేవలం ఆంధ్రప్రదేశ్‌కు పరిమితం కాలేదు. ఆయన జాతీయ రాజకీయాలలోనూ కీలక పాత్ర పోషించారు. నేషనల్ ఫ్రంట్ వంటి జాతీయ కూటములలో ఆయన పాత్ర, కేంద్రంలో ప్రాంతీయ పార్టీల ప్రాముఖ్యతను బలపరిచింది. ఆయన రాజకీయ జీవితం సినిమా రంగం లాగే స్ఫూర్తిదాయకంగా, విప్లవాత్మకంగా సాగింది.

**సామాజిక, సాంస్కృతిక సహకారం :**

ఎన్టీఆర్ ఒక నటుడు, రాజకీయ నాయకుడు మాత్రమే కాదుబీ ఆయన ఒక సామాజిక సంస్కర్త, సాంస్కృతిక రాయబారి. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పట్ల ఆయనకున్న అభిమానం ఆయన చిత్రాలలో, రాజకీయ ప్రసంగాలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన చిత్రాల ద్వారా తెలుగు సాహిత్యంలోని గొప్ప రచనలను, భక్తి భావనలను, సామాజిక విలువలను ప్రజలకు చేరవేశారు. "అన్నమయ్య" చిత్రం ద్వారా తెలుగు సాహిత్యంలోని ఆధ్యాత్మిక వారసత్వాన్ని, "లవకుశ" ద్వారా రామాయణ గాథను, "దానవీర శూర కర్ణ" ద్వారా మహాభారతంలోని నీతి విలువలను ప్రజలకు అందించారు.

ఎన్టీఆర్ రాజకీయ ఉద్యమం తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించింది, తెలుగు వారి ఐక్యతను, గుర్తింపును బలోపేతం చేసింది. ఆయన పాలనలో మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధి, విద్యా సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిని పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన అడుగు.

**వ్యక్తిగత జీవితంలో స్ఫూర్తిదాయక గుణాలు :**

ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితం కూడా ఆయన ఆదర్శాలకు అద్దం పట్టింది. ఆయన నీతి నిబద్ధత, క్రమశిక్షణ, సామాన్య ప్రజలతో ఆత్మీయత ఆయనను ఒక జననాయకుడిగా నిలబెట్టాయి. ఆయన సినిమా షూటింగ్‌లో ఉన్నా, రాజకీయ సభలలో ఉన్నా, ప్రజలతో సమావేశమైనా, ఎల్లప్పుడూ వినయంతో, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించారు. ఆయన జీవితంలోని అనేక సంఘటనలు, ముఖ్యంగా రాజకీయ సంక్షోభాలలో ఆయన చూపిన ధైర్యం, పట్టుదల, యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

**ముగింపు :**

ఎన్టీఆర్ జయంతి తెలుగు జాతికి ఒక గొప్ప సందర్భం. ఇది ఆయన సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టడానికి ఒక పిలుపు. ఎన్టీఆర్ జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది – సమాజ శ్రేయస్సు కోసం, ఆత్మగౌరవం కోసం, నీతి విలువల కోసం నిరంతరం కృషి చేయాలి. ఈ జయంతి సందర్భంగా, ఎన్టీఆర్ ఆదర్శాలను స్మరిస్తూ, ఆయన మార్గంలో మనం కూడా తెలుగు సమాజం యొక్క ఉన్నతి కోసం పాటుపడదాం. ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వం, అమర దీపం, శాశ్వత స్ఫూర్తి!



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## చదువు



చదువుకునుటకు  ఆసక్తి, జ్ఞాపకశక్తి చాలు
కార్పొరేట్ స్కూళ్ళల్లో ర్యాంకులు విజ్ఞానానికి
కొలమానం కాదని గుర్తించండి..
విద్యార్థులలో ప్రతిభను వెలుగులోకి
తెచ్చే విధానం కావాలి అని గుర్తించండి..
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..
కార్పొరేట్ స్కూళ్లు పూట పూటకు పరీక్షలు పెట్టి
విద్యార్థులను యంత్రాల్లా తయారు చేస్తూ...
చదువాలి అన్న ఆసక్తి లేకుండా చేస్తున్నాయి..
సమయస్ఫూర్తిలేని చదువులు మనకెందుకు
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..
కార్పొరేట్ స్కూళ్లు బండెడు హోమ్ వర్క్ ఇచ్చి
చిన్నారుల చిట్టి మెదడుకు నిద్ర లేకుండా చేస్తున్నాయి..
విలువలు నేర్పిన విద్య చిన్నారులకు కావాలి..
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..
కార్పొరేట్ స్కూళ్లు అధునాతన బిల్డింగ్స్ చూపిస్తూ
డాంబికత్వం ప్రదర్శిస్తూ అధిక ఫీజులు వసూలుచేస్తూ
స్పెషల్ క్లాసులు అంటూ గంటల కొద్దీ పాఠాలు  చెప్తూ
పిల్లల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నారు..
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..
కార్పొరేట్ స్కూళ్లు వసూలు చేసే అధిక ఫీజుల వల్ల
తల్లితండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపోయి
పిల్లల భవిష్యత్తు మధ్యలోనే తుంచేస్తున్నారు..
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..



**మంజుల పత్తిపాటి (కవయిత్రి).**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.**
**యాదాద్రి భువనగిరి జిల్లా,**
**తెలంగాణ రాష్ట్రం.**

# తెలుగుప్రజల భవిష్యత్ కోసం ఆరు శాసనాలు

**- కాలానుగుణంగావిధానపరమైన మార్పులు**
**- 43ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశాం**
**- అధికారంతో సంబంధం లేకుండా సేవ చేస్తూనే ఉన్నాం**
**- తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ మన తెలుగుదేశంలి**
**- ఇబ్బందులున్నా సూపర్ 6 అమలులో ముందుకే**
**- కడప మహానాడు వేదికపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్**

**పులివెందుల మే 27 (జనస్వరం) :** కాలం మారుతోంది.. ప్రజల అవసరాలు మారుతున్నాయి.. వారి ఆలోచన విధానం కూడా మారుతోంది.. పార్టీ మూల సిద్ధాంతం స్ఫూర్తితో ప్రస్తుత ప్రజా అవసరాలకు అనుగుణంగా కీలక విధానపరమైన మార్పులు తీసుకురావాలి, ఇందుకోసం ఆరు శాసనాలను తాను ప్రతిపాదిస్తున్నానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప మహానాడు వేదికపై తొలిరోజు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధుల నుద్దేశించి యువనేత నారా లోకేష్ మాట్లాడుతూ విశ్వ విఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారకరామారావు పార్టీ పెట్టిన ముహూర్త బలం గొప్పదన్నారు. టీడీపీ అంటే తెలుగుజాతి ఆత్మగౌరవం.  అన్నదాతలకు అండగా నిలిచేందుకు పుట్టిందని మన పార్టీ, కార్మికుల కష్టాలు తీర్చేందుకు పెట్టింది మన పార్టీ అన్నారు. పేదవాళ్లకు కనీస అవసరాలైన కడుపు నిండా భోజనం, కట్టుకోవడానికి బట్టలు, ఉండేందుకు పక్కా ఇల్లు ఇవ్వాలన్న ధ్యేయంతో అన్నగారు పార్టీ పెట్టారని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ అజెండాలతో ఎన్నో పార్టీలు పుట్టినా  తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ మన తెలుగుదేశం అన్నారు. ఏ కష్టమొచ్చినా మొదటి స్పందించేది మనమేనని తెలిపారు. 43ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశామని. మనకు అధికారం కొత్తకాదు.. ప్రతిపక్షమూ కొత్తకాదు. అధికారం ఉన్నా లేకపోయినా తెలుగు వారికి కష్టం వస్తే మొదట స్పందించే పార్టీ తెలుగుదేశం అన్నారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అని ఆరోజు అన్నగారు అన్నారు. మన అధినేత చంద్రబాబు దగ్గర నుండి కార్యకర్తల వరకూ అందరం ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా అడుగులు వెయ్యాలి, సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు చర్చ జరగాలి. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు  ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పార్టీని మరో 40 ఏళ్లపాటు నడిపించడానికి అవసరమైన కీలక నిర్ణయాలపై ఈ మహానాడు వేదికగా చర్చించాలి. మార్పు అనేది శాశ్వతంగా ఉంటుందని నమ్మే పార్టీ తెలుగుదేశం అన్నారు

**ఆరుశాసనాలతో భవిష్యత్ ప్రణాళికలు :**

అన్న ఎన్టీఆర్ హయాంలో ఆత్మాభిమానం నినాదం నియంతృత్వాన్ని తరిమేసింది.  చంద్రబాబు హయాంలో ఆత్మవిశ్వాసం అనే నినాదం తెలుగు ప్రజల భవిష్యత్తుకు పునాది పడింది. ఇప్పుడు ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలకు, పార్టీకి, కార్యకర్తలకు మంచి భవిష్యత్తును అందించే లక్ష్యంతో సరికొత్త  ప్రణాళికలు రూపొందించాల్సిన సమయం వచ్చింది. ఇందుకోసం ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నానని తెలిపారు.

**తెలుగుజాతి విశ్వఖ్యాతి :**

"దేశం దేశంలో తెలుగుదేశం వల్లే తెలుగువారికి ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉంది. ఒకనాడు అన్న ఎన్టీఆర్ ను బర్త్ రఫ్ చేస్తే డిల్లీ మెడలు వంచి మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అదీ తెలుగుజాతి పౌరుషం. తెలుగువారిని ప్రపంచ పటంలో పెట్టింది మన చంద్రన్న. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా తెలుగువారు ప్రపంచంలో నెం.1 స్థానంలో ఉండాలి. అన్నిరంగాల్లో మన తెలుగు వారే ముందుండాలి. దీనినే అజెండాగా పెట్టుకొని మనం పని చేయాలి.

**యువగళం :**

టీడీపీలో యువతకు పెద్దపీట వేయబోతున్నాం. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తాం, పనిచేసేవారిని ప్రోత్సహిస్తాం. గతప్రభుత్వం హెచ్ ఎస్ బిసి, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలను తరిమేసింది. మన ప్రభుత్వంలో టీసీఎస్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్, ఎన్టీపీసీ, బీపీసీఎల్, రిలయన్స్ సీబీజీ, ఆర్సెలార్ మిట్టల్ వంటి బడా కంపెనీలను తీసుకువచ్చాం. మెగా డిఎస్సీ ద్వారా 16,347 పోస్టుల్లో జూన్ మాసంలో భర్తీచేస్తున్నాం. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాం. మనరాష్ట్రంలో బలమైన యువశక్తి ఉంది. వారికి సరైన అవకాశాలు ఇస్తే దూసుకుపోతారు. అన్నిరంగాల్లో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మన లక్ష్యం.

**స్త్రీశక్తి :**

అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది మన చంద్రన్న. గత ప్రభుత్వంలో శాసనసభ సాక్షిగా మహిళలను అవమానించారు. సొంత తల్లిని, చెల్లిని మెడపట్టి రోడ్డుపైకి గెంటేశారు. ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్, మహిళలకు విశ్వవిద్యాలయాలు, దీపం పథకం ప్రవేశపెట్టింది తెలుగుదేశం. రానున్నరోజుల్లో మహిళలను మరింత బలోపతం చేసేందుకు స్త్రీ శక్తిద్వారా మనం కృషి చేయాలి. పార్టీ పదవుల దగ్గర్నుంచి అన్నిరంగాల్లో మహిళలకు సమాన బాధ్యత, భద్రత కల్పించాలి. ఈరోజు నేను కొన్ని విషయాలు మీకు చెప్పాలని అనుకుంటున్నాను. చట్టాలు, శిక్షల వల్ల సమాజంలో మార్పురాదు. మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి. ఇప్పుడు కూడా కొన్ని పదాలు వాడుతున్నారు. గాజులు తొడ్డుకున్నావా, చీరకట్టుకున్నావా, ఆడపిల్లలా ఏడవొద్దు లాంటి పదాలు మనం మానేయాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. మనం ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక మహిళా మంత్రి నాకు చీర, గాజులు పంపిస్తా అన్నారు. అవి పంపిస్తే నా అక్కచెల్లెమ్మలకు కానుకగా ఇచ్చి కాళ్లు మొక్కుతానని చెప్పాను.

**పేదల సేవలో – సోషల్ రీఇంజనీరింగ్ :**

పేదరికం లేని సమాజం తెలుగుదేశం పార్టీ లక్ష్యం. 2 రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, పెన్షన్ ఇచ్చింది అన్న ఎన్టీఆర్. చాలీచాలని పెన్షన్ 5రెట్లు పెంచి 200 నుంచి 1000 రూపాయలు చేసింది, వెయ్యి నుంచి 2వేలు చేసింది మన చంద్రబాబు. ఇప్పుడు దేశంలోనే ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా 4వేల రూపాయల పెన్షన్ మన చంద్రన్న అందిస్తున్నారు. డ్వాక్రా, దీపం, అన్న క్యాంటీన్ ఇచ్చింది మన చంద్రన్న. భారతదేశంలో ఏ నాయకుడు సాహసం చేయలేదు. మన నాయకుడు సాహసం చేసి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా  బాబు సూపర్ – 6 హామీని అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నాం. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ పెంచాం. మూసేసిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. మెగా డిఎస్సీ ప్రకటించాం. వచ్చేనెలలో తల్లికి వందనం ఇస్తున్నాం. ఆగస్టు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేస్తాం. ఇప్పుడు పీ–4 కాన్సెప్ట్‌తో పేదరికం నుంచి కుటుంబాలను బయటకు తీసుకురావడానికి చేయూతనందిస్తున్నారు మన చంద్రన్న. టీడీపీ ఆవిర్భావం తర్వాత బడుగు, బలహీనవర్గాలకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది. పార్టీకి పునాదిగా ఉన్న బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 33శాతం రిజర్వేషన్ ఇచ్చింది తెలుగుదేశం పార్టీ. అందరి ఆమోదంతో ఎస్సీ వర్గీకరణ చేసింది తెలుగుదేశం పార్టీ. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని కుటుంబాలకు సామాజిక సమన్యాయం అందుకే ప్రతివారికి న్యాయం చేసేలా సోషల్ రీఇంజనీరింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**అన్నదాతకు అండగా :**

రైతు లేకపోతే సమాజమే లేదు. ఈ సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన పార్టీ తెలుగుదేశం. అన్న ఎన్టీఆర్ దగ్గర్నుంచి మన సీబీఎన్ వరకు రైతుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషిచేశాం. డ్రిప్ ఇరిగేషన్ దగ్గరనుంచి నీటిపారుదల ప్రాజెక్టులు, సబ్సిడీలు ఇవ్వడమేగాక ఉద్యాన పంటలను ప్రోత్సహించింది తెలుగుదేశం. ఈరోజు మనం ఆక్వా, పామాయిల్, కోకోలో నెం.1, మామిడి, జీడి పంటల్లో నెం.2 స్థానాల్లో ఉన్నాం. దీనికి కారణం తెలుగుదేశం. అన్నదాతకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుంది. పొగాకు, కోకో, మిర్చి ధరలు పడిపోతే మద్దతు ధర ఇచ్చి ఆదుకుంది మన నాయకుడు చంద్రబాబు. బంగారం లాంటి భూములు మన రాష్ట్రంలో ఉన్నాయి. చేయూతనందిస్తే మన రైతులు బంగారం పండిస్తారు. అందుకే అన్నదాతకు అండగా అనే విధానాన్ని అమలు చేయాలి.

**కార్యకర్తే అధినేత :**

ఒక అంజిరెడ్డి తాత, ఒక మంజుల, ఒక తోట చంద్రయ్య నాకు స్ఫూర్తి. ఆనాడు పుంగనూరు నియోజకవర్గంలో అంజిరెడ్డి తాత తొడగొట్టి మీసాలు మెలేసి నామినేషన్ వేసి చూపించారు. ప్రత్యర్థుల దాడిలో రక్తం కారుతున్న భయపడకుండా బూత్‌లో నిలబడింది మన అక్క మంజుల. తోట చంద్రయ్య గురించి ఎంత చెప్పినా తక్కువ. నడివీధిలో కత్తి గొంతుపై పెట్టి ఒక్కసారి వారి నాయకుడికి జై చెప్పమంటే... జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని ప్రాణాలు కోల్పోయాడు చంద్రయ్య. ఎపిలో ఎప్పుడూ లేనివిధంగా చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చాం. అటువంటి కరుడుగట్టిన కార్యకర్తలే మన బలం, బలగం. దేశంలో ఏ పార్టీకి లేనివిధంగా కోటిమంది కుటుంబసభ్యులు మనకి ఉన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. కార్యకర్త చెమట వల్లే ఈనాడు మేం ఇక్కడ కూర్చున్నాం. ఆనాడు మీరు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజల్లోకి తీసుకెళ్లారు. శంఖారావం చేయాలని అంటే మీరంతా ముందుకు వచ్చారు. కార్యకర్తలు నాయకులు చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరగండి, పార్టీనే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తుంది. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలను ఆదుకున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. కార్యకర్తలకు 5లక్షల ప్రమాద బీమా, విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ. కార్యకర్తకు కష్టమొస్తే మొదట స్పందించేది తెలుగుదేశం పార్టీ. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు అండగా నిలబడింది తెలుగుదేశం. అనంతపురంలో ఫ్యాక్షన్‌లో చనిపోయిన కార్యకర్తల కుటుంబసభ్యులు అటువైపు వెళ్లకూడదని చంద్రబాబుగారు ఎన్టీఆర్ మోడల్ స్కూలు ఏర్పాటు చేశారు. వారికి తండ్రిగా నిలబడటం నా బాధ్యత అని చెప్పారు. యువగళం పాదయాత్రలో వారి కష్టాలు నేరుగా చూశాను. చంద్రబాబు సాయాన్ని ఆ పిల్లలు ఇప్పటికీ మర్చిపోవడం లేదు. అలాంటి కార్యకర్తలను ఆదుకోవడానికి, వారు సొంత కాళ్లపై నిలబడేందుకు పార్టీ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఆరు శాసనాలు కీలకమైనవి. నా తెలుగు కుటుంబం సాక్షిగా ఈ మహానాడు వేదికపై ఆరుశాసనాలను ప్రతిపాదిస్తున్నాను" ఈ ఆరుశాసనాలను బలపర్చాల్సిందిగా యువనేత లోకేష్ కోరారు.

# నకిలీ వైద్యులతో జాగ్రత్త ఉండండి

**అంతర్జాతీయ క్రీడాకారిణి, ఉమెన్స్ వెల్నెస్ కోచ్, సామాజిక కార్యకర్త పూర్ణిమ మండవ**

**హైదరాబాద్, మే 28 (జనస్వరం) :** నకిలీ వైద్యులతో వైద్యులు లేకుండా, టెక్నీషియన్లతో అర్హత లేని వాళ్ళతో వైద్యం చేయిస్తున్నారని, ఇటువంటి సంస్థలతో జాగ్రత్తగా ఉండాలని అంతర్జాతీయ క్రీడాకారిణి, ఉమెన్స్ వెల్నెస్ కోచ్, సామాజిక కార్యకర్త పూర్ణిమ మండవ తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఆరోగ్యం' సేవా రంగంలో ఉందన్నారు. ఈ రంగంలో ఉన్న వారు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కానీ దీనిని వ్యాపారమయం చేశారన్నారు. ఈ రంగంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు మెడికల్ మాపీయాగా అభివర్ణిస్తున్నారని చెప్పారు. కొంత మంది వ్యక్తులు, సంస్థల వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. వీళ్ల అత్యాశతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. నకిలీ వైద్యులపై గత కొద్ది రోజులుగా పోరాటం చేస్తున్నామన్నారు. అందులో భాగమే హెచ్ఫీ క్లినిక్ సమస్య కూడా అన్నారు. ఆ క్లినిక్లో జరుగుతున్న అవకతవకలపై ప్రశ్నించామన్నారు. నెలన్నర తర్వాత వాస్తవాన్ని అర్థం చేసుకున్నారన్నారు. ఈ వ్యవధిలో అవకతవకలు సరి చేసుకున్నారని చెప్పారు. క్షమాపణలు చెప్తే బిజినెస్ దెబ్బతింటుందని తెలిపారన్నారు.



అయితే, ఈ సమస్యతో బిజినెస్ దెబ్బతినడంతో సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇతర సంస్థలు కూడా ఒక్కసారి ఆలోచించాలన్నారు. ప్రజారోగ్యంతో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాకాకుండా, మాపై బురద జల్లడం ద్వారా మంచి వారవుతారనుకోవడం పొరపాటు అన్నారు. కోర్టులకు, పోలీసు స్టేషన్లకు వెళ్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. న్యాయపరంగా మీకు ఎంత హక్కు ఉందో మాకు కూడా అంతే హక్కు ఉందని గుర్తించుకోవాలన్నారు. చర్మం, జుట్టు, వెల్నెస్ రంగంలో జరుగుతున్న నకిలీ వైద్యులు, అర్హత లేని టెక్నీషియన్‌ల ద్వారా చికిత్సలు జరగడం సరికాదన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడమే మా బాధ్యత అన్నారు. నకిలీ డాక్టరేట్‌లు కొనుగోలు చేసి, వాటిని వాడుతూ ప్రజలను మోసం చేస్తున్న పరిస్థితులను ఇప్పటికే సామాజిక మాధ్యమాలలో బయటపెట్టామన్నారు. అర్హత లేని వ్యక్తులు 'డాక్టర్' అనే బిరుదు ధరించి, ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. మా పోరాటం తర్వాత డాక్టర్ అనే పదాన్ని తీసివేయడం, అర్హత గల వైద్యులను నియమించడం జరిగిందన్నారు. ప్రముఖ నటుడు అలీని కూడా తప్పుదారి పట్టించిన ఘటన చూశామన్నారు. ప్రింట్ మీడియా, వీడియోల్లో డాక్టర్ హర్షిత అని పేర్కొనడం, కానీ ఎటువంటి స్పష్టీకరణ లేదన్నారు. డాక్టర్లు లేనప్పుడు టెక్నీషియన్లు చికిత్సలు నిర్వహించినట్లు క్లయింట్లు అనేక ఫిర్యాదు ఇచ్చారన్నారు. అసత్య ప్రచారం చేయడం, మానసికంగా బాధించడం వంటి చర్యల ద్వారా నిజం మాట్లాడే వారిని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావితులతో ట్రోల్ చేయడం అన్యాయమన్నారు. పూర్ణిమ మండవ అంతర్జాతీయ క్రీడాకారిణి, మహిళల వెల్‌నెస్ కోచ్. క్రీడా, ఫిట్‌నెస్ రంగంలో ఆమెకు 30 ఎళ్లకు పైగా అనుభవం ఉంది. అందులో 15 ఏళ్ల నుంచి మహిళల వెల్‌నెస్‌పై పని చేస్తున్నారు. బాల్యం నుంచి పూర్ణిమ అనేక క్రీడలలో చురుకుగా పాల్గొనే వారు. వాలీబాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెటిక్స్‌లో ప్రతిభను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తరఫున బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర బృందాలకు కెప్టెన్‌గా సేవలందించారు. నెట్‌బాల్‌లో భారత్ జాతీయ జట్టులో కూడా ప్రాతినిధ్యం వహించారు. వాలీబాల్, అథ్లెటిక్స్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక విజయాలు సాధించారు.

## మద్యం మత్తులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళ హంగామా



**భైంసా, మే 27 (జనస్వరం) :** భైంసా ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి గేటు వద్ద ఓ మహిళ మద్యం సేవించి కొన్ని నిమిషాల పాటు రచ్చరచ్చ చేసింది. "నేను తాగిన అయిందేంటి?" అంటూ గొడవ పెడుతూ, అక్కడ ఉన్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. ఆమె ప్రవర్తనతో ఆ ప్రాంతం కొంతసేపు అల్లకల్లోలంగా మారింది. విధి నిర్వహణలో ఉన్న స్పెషల్ పోలీస్ స్టాఫ్ విషయాన్ని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయగా, మహిళా కానిస్టేబుల్ అక్కడకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సమాచారం ప్రకారం, ఆ మహిళ పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతోందని చెబుతున్నారు. ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయిన ఆమె, అక్కడే ఉన్న వారిని మాటలతో వేధించడమే కాకుండా, పోలీసులకు కూడా చికాకులు కలిగించినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. "ఏదో ఏమో కానీ ఆ కొన్ని నిమిషాలు పోలీస్ స్టాఫ్‌కూ, పేషంట్లు, సహాయక సిబ్బందికీ నరకం చూపించింది," అంటూ అక్కడ ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మహిళను అనంతరం ఆసుపత్రి పరిసరాల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది.

## దళితులపై దాడిని ఖండిస్తూ 'ఛలో బోరిగాం'ను విజయవంతం చేద్దాం

**విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ**



**హైదరాబాద్, మే 27 (జనస్వరం) :** నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో బుద్ధ జయంతి సందర్భంగా దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, మే 30న నిర్వహించనున్న 'ఛలో బోరిగాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఏఎంఎస్ఏ (అంబేద్కర్ ముస్లిం స్టూడెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఇతర ప్రగతిశీల విద్యార్థి సంఘాలతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధనూరే రాహుల్ మాట్లాడుతూ, బోరిగాం గ్రామంలో బుద్ధ జయంతి సందర్భంగా స్థానిక దళితులు బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తుండగా, కొంతమంది మనువాద దుండగులు అడ్డుపడి దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిలో బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొంటూ, ఇది శాంతి, సమత్వం, అహింసకు మద్దతుగా నిలిచిన బుద్ధుని విరోధంగా చేసిన చర్య మాత్రమే కాక, భారత దేశం బహుళత్వ వారసత్వాన్ని అవమానపరిచే చర్యగా అన్నారు. ఈ దాడిపై ఇప్పటివరకు స్థానిక ఎమ్మెల్యే గానీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గానీ స్పందించకపోవడం ఆందోళనకరమని, ఇది ప్రభుత్వ అప్రమత్తతను సూచిస్తుందని విమర్శించారు. దళితుల హక్కులు, బుద్ధిజంపై జరిగిన ఈ దాడికి నిరసనగా 'ఛలో బోరిగాం'కు సమాజంలోని ప్రతి న్యాయపరుడు, విద్యార్థి, ఉద్యమకారుడు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఎంఎస్ఏ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, మాసంపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కోట శ్రీనివాస్ గౌడ్, పీడీఎస్‌యూ నాయకులు సుమంత్, రుక్మత్ పాషా, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, హరీష్, అఖిల్, ముత్యం, అరుణ్, అనిల్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మే 30న బోరిగాం గ్రామంలో నిర్వహించనున్న కార్యక్రమానికి విస్తృత ప్రజా మద్దతు కూడగట్టాలని, దళితులపై దాడులను ప్రశ్నిస్తూ సంఘీభావం వ్యక్తం చేయాలని వారు కోరారు.

## కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో శోభా రాజు "సరస్వతి" గానం



**శేరిలింగంపల్లి, మే 27 (జనస్వరం) :** కాళేశ్వరంలో నిర్వహిస్తున్న శ్రీ సరస్వతి పుష్కరాల సందర్భంగా చివరి రోజు సోమవారం సాయంత్రం శోభా రాజు, వారి శిష్య బృందం "మానస పటేల్, అభిరామ్, శ్రద్ధ, చైత్ర, సువర్ణ, అక్షయ, జనని, రన్విత" సంయుక్తంగా "గణరాజ గుణరాజ, చాలదా హరినామ, కొండలలో నెలకొన్న కోనేటి" అనే బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమయ్య సంకీర్తనలు పాడారు. తర్వాత పుష్కరం సందర్భంగా "శ్రీ సరస్వతి" దేవి అనుగ్రహంతో శోభా రాజు స్వీయ రచన, స్వరపరచిన "సరస్వతి సరస్వతి సరస్వతి కురుసన్నిదౌ" అనే ఒక నూతన సంకీర్తన చాలా చక్కగా కచేరీ చేశారు. వీరికి కీ బోర్డు కళ్యాణ్, తబలా పాండు వాయిద్య సహకారం అందించారు. చివరిగా, కార్య నిర్వాహకులు శోభా రాజును ప్రశంసించి, గౌరవ సత్కారాలు అందించారు.

## ప్రాణాలు పోయినా పర్వాలేదు..

- బుద్ధుడు విగ్రహం అదే స్థలంలో ప్రతిష్ఠించాలి
- బోరిగాం దళితుల ఘన ప్రతిజ్ఞ
- భైంసాలో రిలే నిరాహార దీక్ష రెండవ రోజు ప్రశాంతంగా కొనసాగుతుంది



**భైంసా, మే 27 (జనస్వరం) :** "ప్రాణాలు పోయినా పర్వాలేదు.. బుద్ధుడు విగ్రహాన్ని అదే స్థలంలో మళ్లీ ప్రతిష్ఠించుతామే" అంటూ నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని రాళ్ల బోరిగాం గ్రామ దళితులు ప్రభుత్వ అధికారులపై గళమెత్తారు. బుద్ధ అంబేద్కర్ పరిరక్షణ కమిటీ ముథోల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండవ రోజు కూడా ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, బోరిగాం గ్రామంలో బుద్ధ జయంతి సందర్భంగా ప్రతిష్ఠించిన బుద్ధ విగ్రహాన్ని కొంతమంది శత్రుత్వ భావన కలిగిన శక్తులు ధ్వంసం చేయడం అమానుషమని పేర్కొన్నారు. దళితుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం గానీ, సంబంధిత అధికారులు గానీ స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. "మేం వెనక్కి తగ్గేది లేదు. అదే భూమిలో మళ్లీ బుద్ధుని ప్రతిష్ఠిస్తాం. అవసరమైతే ప్రాణాలు కోల్పోయినా తక్కువ కాదు," అంటూ వారు హెచ్చరించారు. ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు బుద్ధ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతివ్వకపోతే, ముథోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల దళితులు కలసి భారీ స్థాయిలో 'ఛలో బోరిగాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఉద్యమ నేతలు స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి విస్తృత ప్రజా మద్దతును కూడగట్టే చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, బుద్ధుడు విగ్రహ ధ్వంసానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## కేటీఆర్‌పై కుట్రలను సాగనివ్వం


**బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి, మే 27 (జనస్వరం) :** కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, శేరిలింగంపల్లి యువ నాయకుడు రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుట్ర పూరితంగా ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలను చేస్తుందని విమర్శించారు. ఫార్ములా ఈ కేసుతో వేధింపులకు దిగుతున్నారన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌దే అన్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం కరెక్ట్ కాదన్నారు. ఈడీలో రేవంత్ రెడ్డి పేరు ఉందని, రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీ నేతగా ఉన్న కేటీఆర్ ప్రశ్నించారన్నారు. దాన్ని జీర్ణించుకోలేకనే ఫార్ములా ఈ పేరుతో నోటీసులు ఇచ్చి అల్ప సంతోషానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈడీ ఛార్జ్ షీట్ పై సమాధానం చెప్పాలని రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

## నెల రోజుల్లో కొత్త అక్రిడిటేషన్లు

- తక్షణమే ఉన్న కార్డుల గడువు పొడిగింపు కు ఉత్తర్వులు
- ఏపీయూడబ్ల్యూజే నేతలకు ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా హామీ



**విజయవాడ, మే 27 (జనస్వరం) :** వచ్చే నెల రోజుల్లోగా అర్హులైన జర్నలిస్టులు అందరికీ కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని, ప్రస్తుతం ఉన్న కార్డులు రెన్యువల్ చేస్తామని ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ హిమాన్స్ శుక్లా చెప్పారు. అక్రిడేషన్ల గడువు పొడిగింపు, కొత్త కార్డులు మంజూరు తదితర అంశాలపై మంగళవారం మధ్యాహ్నం సమాచారం శాఖ డైరెక్టర్ హిమాంశు శుక్లా గారిని ఏపీయూడబ్ల్యూజే నాయకులు కలిశారు. ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్‌ల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో వాటిని తక్షణమే రెన్యువల్ చేయాలని, ఈనెల 31, జూన్ 1వ తేదీలు ఆర్టీసీకి సెలవు దినాలు అయినందున తక్షణమే బస్‌పాస్‌లు రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మరోసారి అక్రిడిటేషన్ పొడిగింపునకు అవకాశం లేకుండా రెగ్యులర్‌గా ఇచ్చే కొత్త అక్రిడేషన్ల ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని డైరెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఈ రోజే అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు ఫైలు పంపిస్తామని చెప్పారు. అలాగే జర్నలిస్టులు ఇబ్బంది పడకుండా ఈనెల 30వ తేదీలోపే బస్‌పాస్‌లు రెన్యువల్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెండు లేక మూడు నెలల కాలానికి అక్రిడేషన్లను రెన్యువల్ చేస్తామని, అయితే ఈలోపే రెగ్యులర్ అక్రిడేషన్ల ప్రక్రియ కూడా నెల రోజుల్లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడేషన్లపై నియమించిన మంత్రుల కమిటీ కూడా దీనిపైన ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపిందని, త్వరలోనే అక్రిడిటేషన్ కమిటీ జీవో వెలువడుతుందని శుక్లా తెలిపారు. డైరెక్టర్ ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కమిటీ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వర రావు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్, కార్యదర్శి దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్ రఘు, జి రామారావు, ఎం కోటిరెడ్డి పాల్గొన్నారు.

## పితృదేవతల పిండ ప్రదానం షెడ్లను ఏర్పాటు చేయండి

**టీటీడీ ఈఓకు "రెడ్డీస్ భారత్ అసోసియేషన్" వినతి పత్రం**



**తిరుపతి, మే 27 (జనస్వరం) :** హిందూ సనాతన ధర్మంలో పితృదేవతలకు అమావాస్య, సంక్రాంతి, కాల అమావాస్యను పురస్కరించుకొని నగర ప్రజలు పిండ ప్రదాన సమర్పణ బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య పర్వదినాలలో జరిపించడం హిందువుల సంప్రదాయమని, అత్యంత పవిత్రమైన ఈ కార్యక్రమాన్ని కపిలతీర్థం వద్ద నిర్వహించుకునేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం టీటీడీ ఈఓ శ్యామలరావుకు "రెడ్డీస్ భారత్ అసోసియేషన్" తరపున వినతి పత్రం ఇచ్చారు. ఇప్పుడు ప్రత్యేక షెడ్లు లేనికారణంగా రోడ్లపై కూర్చొని కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతూ నగర ప్రజలు పితృ దేవతలకు పిండ ప్రధాణం జరిపించుకోవడం బాధాకర మని నవీన్ అన్నారు. కపిలతీర్థం వద్ద పర్వదినాలలో పిండ ప్రధానం కోసం శాశ్వత షెడ్లు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని రెడ్డీస్ భారత్ కమిటీ విజ్ఞప్తి చేశారు. కపిలతీర్థం వద్ద పితృదేవతలకు సమర్పించే పిండ ప్రదాన కార్యక్రమానికి శాశ్వత షెడ్లు నిర్మించి మంచినీటి సౌకర్యం కల్పించాలని, అలాగే రామచంద్ర పుష్కరిణి, గోవిందరాజస్వామి పుష్కరిణి ప్రాంతాలలో సైతం కనీస మౌలిక సదు పాయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కపిలతీర్థం వద్ద పితృదేవతలకు రోడ్లపై కూర్చొని పిండ ప్రధాన కార్యక్రమం నిర్వహించడం బాధాకరమని తిరుమల కొండకు వెళ్లే వాహనదారులకు సైతం అసౌకర్యం కలుగుతుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గతంలో లాగా కపిల తీర్థంలోని ఆంజనేయస్వామి ఆలయం ముందు భాగంలో, ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో పర్మినెంట్ షెడ్లను, స్నానపు గదులను ఏర్పాటు చేయాలని ఈవోకి విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా స్పందించి సహృదయంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పడం శుభపరిణామం అని నవీన్ తెలిపారు. టీటీడీ ఈఓని కలిసిన వారిలో నవీన్ కుమార్ రెడ్డి, దుగాండ్ల పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మునీశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మబ్బు శ్రీమన్నారాయణ రెడ్డి, సిద్ధారెడ్డి, కరుణాకర్ రెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

## టీడీపీలో కార్యకర్తే అధినేత

**టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్**



**విజయవాడ, మే 27 (జనస్వరం) :** టీడీపీలో కార్యకర్త అధినేత అని చెప్పిన విధంగా సీఎం చంద్రబాబు ప్రసంగంతో టీడీపీ కార్యకర్తలు నాయకుల్లో ఉత్సాహం రెట్టింపు అయిందని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో కడప జిల్లాలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి తొలిరోజే రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా విదేశాల నుండి కూడా భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడం శుభపరిణామమని పేర్కొన్నారు. మరోసారి టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా సీఎం చంద్రబాబుని అత్యున్నతమైన పదవిలో నారా లోకేష్‌ని ఈ మహానాడు పండుగ కార్యక్రమంలో తీర్మానం చేసే దిశగా టీడీపీ అధినాయకత్వం కృషి చేయాలని సూచించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యతో కలిసి మహానాడు పండుగ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# రెండో గర్భధారణలో సమస్యలు పెరుగుతున్నాయి

- ద్వితీయ వంధ్యతపై వైద్య నిపుణుల హెచ్చరిక
- వైద్యనిర్వాహకురాలు, ఫెర్టి9 ఫలదాయకత కేంద్రం డా. జ్యోతి సీ బూడీ

**హైదరాబాద్, మే 27 (జనస్వరం) :** ఆధునిక కుటుంబాల్లో మొదటి బిడ్డ పుట్టిన తరువాత జీవితం పూర్తయిందన్న భావన విస్తరిస్తోంది. అయితే కొందరికి రెండో బిడ్డ కోరిక తీరకపోవడం ఇప్పుడు పెరుగుతున్న సమస్యగా మారుతోంది. వైద్య నిపుణులు దీన్ని 'ద్వితీయ వంధ్యత'గా వ్యవహరిస్తున్నారు. ఒకసారి సంతానాన్ని పొందిన తర్వాత మళ్లీ గర్భం ధరించలేకపోవడం లేదా గర్భధారణ కొనసాగకపోవడం ఈ సమస్యకు ముఖ్య లక్షణాలుగా పేర్కొంటున్నారు. ఫెర్టి9 ఫలదాయకత కేంద్రం వైద్యనిర్వాహకురాలు డా. జ్యోతి సీ బుడి ఈ అంశంపై స్పందిస్తూ, "మొదటి బిడ్డ తరవాత రెండో బిడ్డ సులభంగా పుడతాడన్న నమ్మకం చాలా మందిలో ఉంది. కానీ వాస్తవంగా చూస్తే, 1992 నుంచి 2015 మధ్య ద్వితీయ వంధ్యత రేటు 19.5 శాతం నుంచి 28.6 శాతానికి పెరిగింది. ఇది తల్లిదండ్రుల ఆశలకు గట్టి ఎదురుదెబ్బలుగా మారుతోంది" అని తెలిపారు. ద్వితీయ వంధ్యతకు పలు కారణాలున్నాయని ఆమె వివరించారు. మహిళల్లో 35 ఏళ్ల వయసు దాటిన తరువాత అండాల నాణ్యత, పరిమాణం తగ్గిపోతుందని, అలాగే పీసీఓడీ, థైరాయిడ్ వంటి హార్మోన్ల అసమతుల్యతలు గర్భధారణకు అడ్డుగా మారుతున్నాయని చెప్పారు. గర్భాశయంలో మాసగడ్డలు (ఫైబ్రాయిడ్లు), గర్భనాళాల ముడులు లేదా మొదటి



సీజేరియన్ ప్రసవం కారణంగా ఏర్పడే మచ్చలు కూడా సమస్యలకు దారితీయొచ్చని వివరించారు. బరువు పెరగడం వల్ల అండోత్సర్గ ప్రక్రియలో అంతరాయాలు ఏర్పడుతాయని చెప్పారు. ఇక పురుషుల్లో వయస్సు పెరగడం, అధిక ఒత్తిడి, జీవనశైలి కారణంగా శుక్రకణాల నాణ్యత, చలనం, సంఖ్య తగ్గిపోవడం గర్భధారణకు అడ్డంగా మారుతోందని వివరించారు. పోషకాహార లోపం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి కూడా ప్రభావితం చేస్తాయని వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో దంపతులు ఒంటరిగా భావించడం సహజమేనని, సమాజంలో "ఇక కుటుంబం పూర్తయింది" అనే వ్యాఖ్యలు వారిపై మానసికంగా ప్రభావం చూపవచ్చని ఆమె పేర్కొన్నారు. అయితే ఈ సమస్యకు ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. "అండోత్సర్గను ప్రేరేపించే ఔషధాలు, ఐయుఐ, ఐవీఎఫ్ వంటి ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సల ద్వారా గర్భసాధన అవకాశాలను మెరుగుపర్చవచ్చు. గర్భనాళాల ముడులు, హార్మోన్ల అసమతుల్యతలు వంటి శారీరక సమస్యలు సర్జరీ లేదా ఔషధాల ద్వారా అధిగమించవచ్చు" అని డా. జ్యోతి వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా కీలకమని పేర్కొంటూ, శరీర బరువు నియంత్రణ, సమతుల్య ఆహారం, పొగతాగే అలవాటు మానివేయడం, మానసిక ఒత్తిడి తగ్గించడం వంటి మార్పులు గర్భధారణకు సహకరిస్తాయని సూచించారు. పురుషులూ వ్యాయామం, పోషకాహారంతో శుక్రకణాల నాణ్యత మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న దంపతులకు మానసిక మార్గదర్శనం, మద్దతు సమూహాలు ఎంతో ఉపశమనం ఇస్తాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. "ప్రతి కుటుంబ ప్రయాణం భిన్నంగా ఉంటుంది. రెండోసారి గర్భం రావడంలో సమస్యలు ఎదురవుతున్న వారు ఒంటరిగా లేరు. సరైన సమయంలో వైద్యుల సహాయంతో ఆశలు నెరవేర్చుకోవచ్చు" అని డా.జ్యోతి హితవు పలికారు. రెండో సంతాన ఆశ కలిగిన దంపతులు సంకోచించకుండా ఫలదాయకత నిపుణులను సంప్రదించి, తగిన సమయంలో చికిత్స ప్రారంభిస్తే, ఈ సమస్యను అధిగమించడం పూర్తిగా సాధ్యమేనని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## జూన్ 2 నుంచి శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన టీటీడీ ఈఓ శ్యామల రావు**



**తిరుపతి, మే 27 (జనస్వరం) :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను టీటీడీ ఈఓ శ్యామల రావు మంగళవారం పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన రంగోలీలు, విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, వివిధ రూపాల చిత్రలేఖనాలతో ఆలయాన్ని శోభాయమానంగా మలచాలని సూచించారు. అలాగే, ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరుగనున్న వాహనసేవలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలు జూన్ 1వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుంచి 8.00 గంటల వరకు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. జూన్ 2వ తేదీ ఉదయం 07.02 నుండి 07.20 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణం జరగనుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామివారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. తరువాతి రోజుల్లో చినశేష, హంస, సింహ, ముత్యపుపందిరి, కల్పవృక్ష, సర్వభూపాల, మోహినీ అవతారం, గరుడ, హనుమంత, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, రథోత్సవం, అశ్వవాహనం వాహనసేవలతో పాటు చివరి రోజు చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## కోకో గింజలు
## కిలో రూ.500లకు కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు

**ఏలూరు, మే 27 (జనస్వరం) :** కోకో గింజలు ధర కిలో రూ.500లకు కొనుగోలుకు సంబంధించిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ తెలియజేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష,, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె. శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23వ తేదీన ఏలూరు కలెక్టరేట్లో జరిగిన చర్చలు సందర్భంగా మాండలీజ్ కంపెనీ ప్రతినిధులు కిలో కోకో గింజలు రూ. 450లకు మించి కొనుగోలు చేయలేమని చెప్పగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించగా అందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను 26వ తేదీ సాయంత్రం జారీ చేసిందన్నారు. అన్ని కంపెనీల ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.500 ఇచ్చి ఈ ఆదేశాల ప్రకారం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అయితే రైతులు అందుకు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసి రైతు సేవా కేంద్రాల్లో అందజేయాల్సి ఉందన్నారు. కోకో రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి తమ వద్ద ఉన్న కోకో గింజల వివరాలను అందజేసి కిలో గింజలకు రూ.500 సాధించుకోవాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి ధర ప్రకటించే విధానం కోసం ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం పోరాటం చేస్తుందని, ఈ పోరాటంలో కోకో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## పెదపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ అవగాహన


**కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని జ్ఞాపక కార్యక్రమాలు**



**పెదపాడు, మే 27 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం మరో విశేష కార్యకలాపాలకు వేదికైంది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గురుకులం ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెడ్మాస్టర్ రామాల బెంజిమెన్ రిసోర్స్ పర్సన్‌గా విద్యార్థులు, విద్యార్థినులకు జనరల్ నాలెడ్జ్ అంశాలపై వివరణాత్మక అవగాహన కల్పించారు. ప్రశ్నల రూపంలో చర్చను జరిపి, విద్యార్థుల చురుకుదనాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన సేవలను గుర్తు చేస్తూ ప్రత్యేక నివాళులు అర్పించారు. 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో జన్మించి, 1919 మే 27న చెన్నైలో మరణించిన వీరేశలింగం, సమాజానికి సేవచేసిన గొప్ప సంస్కర్తగా, సాహిత్యవేత్తగా, సమానత్వం కోసం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందినట్టు బెంజిమెన్ వివరించారు. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం వంటి రంగాల్లో మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ పాఠశాలలు స్థాపించిన ఘనత వీరేశలింగందికే చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాణ్యం రామశేష శాస్త్రి రచించిన "అనగనగా... యధార్థగాధలు" పుస్తకంలోని "తల్లి ప్రాణం" అనే కథను విద్యార్థులు చదివి, కథాసారం వినిపించారు. విద్యార్థులు స్వయంగా కథలు చెప్పడంలో పాల్గొనడం, పుస్తక సమీక్ష చేయడం వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అంతేకాక, నృత్య శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించబడింది. బాలబాలికలతో నృత్యాలు నేర్పించి ప్రదర్శింపజేశారు. మొత్తం 22 మంది విద్యార్థులు, విద్యార్థినులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు నాయకత్వం వహించగా, పాల్గొన్న విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. సమగ్రంగా విజ్ఞానాన్ని, సాంస్కృతిక విలువలను చేరువ చేసే కార్యక్రమంగా ఇది ఆకట్టుకుంది.

## శ్రీశైలమల్లన్న రాబడి రూ.3.74 కోట్లు

**ఉభయ దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకలు..**



**శ్రీశైలం, మే 27 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉభయదేవాలయాల హుండీల లెక్కింపు చంద్రావతి కల్యాణమండపములో మంగళవారం ఉదయం నుండి ప్రారంభించగా రూ.3,74,99,234లు నగదు రాబడి లభించిందని అదేవిధంగా 120 గ్రాముల 100 మిల్లిగ్రాముల బంగారం, 4 కేజీల 260 గ్రాముల వెండితో పాటు వివిధ విదేశీ కరెన్సీకూడా లభించినట్లు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మొత్తం భక్తులు కానుకల రూపేణా స్వామి అమ్మవార్లకు సమర్పించుకుందని, ఈ మొత్తం 28 రోజులలో సమకూరిందని కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య సీసీ కెమెరాల నిఘాతో లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, శివసేవకులు పాల్గొన్నారు.

# యోగా మానవాళికి సంజీవిని

**- ప్రతిరోజు యోగా చేద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం**

**- యోగాంధ్రపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిప్యూటీ మేయర్ పి.ఉమామహేశ్వరరావు**



**ఏలూరు, మే 27 (జనస్వరం) :** ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక ఇండోర్ స్టేడియం నుండి నిర్వహించిన యోగాంధ్రపై ప్రత్యేక ర్యాలీని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జెండాఊపి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు, అక్కడి నుండి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన యోగాపై అవగాహన ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవడం మూలంగా ఆరోగ్యం సిద్ధించడంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 నుంచి జూన్ 21వతేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాపై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహణకు సుమారు 400 మంది మాస్టర్ ట్రైనీలను సమకూర్చామన్నారు. అదే విధంగా జిల్లాలో 5 వేల మందికి యోగా శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 5 రోజులపాటు ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వీరందరూ గ్రామ, మండల స్థాయిలో యోగాపట్ల ఆసక్తి కలిగిన వారికి శిక్షణను అందిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 50 వేల మంది యోగాభ్యాసం, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే అంతర్జాతీయ యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సంబంధిత యాప్‌లో రిజిష్టర్ అయి ఉన్నారన్నారు. మిగిలిన వారు కూడా రిజిస్టర్ అయ్యేందుకు ముందుకు రావాలన్నారు. అదే విధంగా జిల్లాలో 4 పర్యాటక ప్రాంతాల్లో ఎంపిక చేసిన నాలుగు రోజులు యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 29న ద్వారకాతిరుమల, జూన్ 5న పట్టిసీమ, జూన్ 11న జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవాలయంవద్ద, జూన్ 18న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాంధ్ర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. అలాగే జూన్ 16 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక సచివాలయాల్లో సంప్రదించి సంబంధిత యోగా పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జూన్ 21న విశాఖపట్నంలో భారత ప్రదాని నరేంద్రమోడి అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారన్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని "యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్" నినాదంతో నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జూన్ 21వ తేదీ వరకు యోగా సాధాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈరోజు యోగా ఆవశ్యకతను తెలిపే విధంగా మాస్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. యోగాకు సంబంధించి వివిధ స్థాయిల్లో పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు సమీపసచివాలయంలో సంప్రదించవచ్చున్నారు. గ్రామస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచినవారు మండల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఆయూష్ ఆర్ డీడీ లక్ష్మీ సుభద్ర, నగరపాలక సంస్థ కమీషనర్ ఎ.భానుప్రతాప్, ఎల్ డిఎం డి. నీలాద్రి, డిసివో కె.శ్రీనివాస్, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, డిఎస్ డివో పి. శ్రీనివాసరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు పి. శివరామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి. పాండురంగారావు, ఏలూరు తహశీల్దారు జి.వి. శేషగిరి, పలువురు సోషల్ మీడియా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నగర ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే నడిపే ఏకైక పార్టీ తెలుగుదేశం


**కడప మహానాడు వేదికపై "శాప్" చైర్మన్ అనిమిని రవినాయుడు**



**కడప (తిరుపతి), మే 27 (జనస్వరం) :** దేశంలో అనేక పార్టీలు ఉన్నా... కొన్ని పార్టీలను వ్యవస్థలు నడుపుతున్నాయి. కొన్ని పార్టీలను నాయకులు నడుపుతున్నారు. కానీ కార్యకర్తలే నడిపే ఏకైక పార్టీ మాత్రం మన తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని "శాప్ " చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తొలిరోజు మహానాడు కార్యక్రమంలో రవినాయుడు పాల్గొని ప్రసంగించారు. మహానాడు కార్యక్రమాలలో వాలంటీర్‌గా పనిచేశానని, అయితే ఈరోజు మహానాడు వేదికపై నిలబడేందుకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపిన మీ అందరికి శిరస్సు వంచి నమస్కారం తెలుపుతున్నానని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కార్యకర్తల సంక్షేమం కోసమే పని చేశారని గుర్తు చేశారు. కార్యకర్తలకు బాధ వచ్చినా.. ఇబ్బంది వచ్చినా.. కన్నీళ్లు వచ్చినా నేనున్నానంటూ.. అధినేత ఎప్పుడూ అండగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారని.. చంపబడ్డారని.. వేధించబడ్డారని.. చివరకు ఊరు వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు. కానీ మనపార్టీ అధినేత మాత్రం ఆరోజు.. ఈరోజు ఎప్పుడూ అండగా నిలబడ్డారని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా విద్య, వైద్యం, అనేక విధాలుగా అండగా ఉంటూ.. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మన బిడ్డలను చదివిస్తూ అండగా నిలబడ్డారని వివరించారు. మా చిత్తూరు జిల్లాలో ఒక మాట ఉంది.. నారా చంద్రబాబు నాయుడు చేతికి ఎముక లేదు.. చేతికి ఎంత వస్తే అంతా కార్యకర్తలకు సాయం చేసి ఆదుకోవడమే ఆయనకు తెలుసు అనేది నిజం చేసి చూపుతున్న నేత అని కొనియాడారు. ఇక యువనేత నారా లోకేష్ కోటి సభ్యత్వాలు చేయించారని, యువగళం పాద యాత్రలో సార్ వెంట అడుగులో అడుగు వేశానని రవినాయుడు గుర్తు చేసుకున్నారు. ఆరోజు కష్టం చెప్పుకోవడానికి వచ్చిన కార్యకర్త, కుటుంబ సభ్యులకు, ప్రజలకు తన ఫోన్ నెంబర్ ఇచ్చారని తెలిపారు. దేశంలో ఏ నాయకుడు తన సొంత నెంబర్‌ను ఇలా ఇవ్వరని, ఇవ్వలేదు.. కానీ లోకేష్ అన్న ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకుడికి ఏ కష్టం వచ్చినా నా నెం బర్ ఇచ్చి కాల్ చేయండని నెంబర్ ఇచ్చారని పేర్కొన్నారు. ఏ మీటింగ్‌కి వెళ్లినా ముందుగా కార్య కర్తల సంక్షేమం గురించి తెలుసుకునేవారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అయినా, ఢిల్లీలో అయినా, అండమాన్‌లో ఉన్నా, ఆఫ్రికాలో ఉన్నా నాకు కష్టం ఉందని కార్యకర్త నుండి మెసెజ్ వస్తే 5 నిమిషాల్లో తన టీమ్‌ను పురమాయించి 5 నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తున్న మన నారా లోకేష్ నాయకత్వం చిరకాలం ఉండాలని కామక్షించారు. 44 సంవత్సరాలుగా కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు ఎప్పుడూ అండగా ఉన్నారని వెల్లడించారు.

## భక్తి శ్రద్ధలతో గంగమ్మకు రెండవ మరు పొంగళ్ళు

**ఆకట్టుకున్న కళాకారుల వేషధారణలు**



**తిరుపతి, మే 27 (జనస్వరం) :** రాష్ట్రంలోనే పేరుగాంచిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర ముగిసిన రెండవ మంగళవారం మరు పొంగళ్ల జాతర వైభవంగా నిర్వహించారు. గంగమ్మ జాతర తర్వాత వచ్చే ఐదు మంగళవారాలు మరుపొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పౌరాణిక వేషధారణలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్ కళాకారులకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లను చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కళాకారులు ప్రతివారం వివిధ వేషధారణలతో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, జాతరకు మరింత శోభను తీసుకువస్తున్నారని ఈఓ జయకుమార్ కొనియాడారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ రంగస్థలం ఆధ్వర్యంలో జాతర తరువాత జరిగే 5 వారాల మరుపొంగళ్లలో తమ కళాకారులు వేషధారణలతో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలియజేశారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డితో పాటు కళాకారులు నగర సంకీర్తన మండలి సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కెఎన్ రాజా, కన్నప్ప గారి కేశవరెడ్డి, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి, ఇర్ల గుణశేఖర్, జయమ్మ, చెంగల్ రాయులు, వాసు, దేశ నాగేశ్వరరావు, మేకల గంగయ్య, వెంకటేశ్వర స్వామి వేషధారణగా మోహన్ రెడ్డి, అష్టలక్ష్మిలుగా శ్రీలక్ష్మి, రమ, లలిత, నాగశ్రీ, ఉమాదేవి, శ్రీవాణి, పార్వతి, సరళ, పురాణ పురుషుల పాత్రలలో మురళీకృష్ణ, వెంకటాచార్యులు, వినోద్ కుమార్, గురుతేజ, రమణారెడ్డి, గోపాల్ రావు, భాస్కరాచారి, మునినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

**- ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి**

**- రేషన్ డీలర్లకు జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి సూచన**



**ఏలూరు, మే 27 (జనస్వరం) :** జూన్ ఒకటో తారీకు నుండి ప్రారంభమయ్యే రేషన్ పంపిణీ కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కంపెనీ విధివిధానాలను వివరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ పంపిణీ సక్రమంగా పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, రాజుల పార్టీ గంగాధర్ గౌడ్, జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరసింహారావు, ఏ ఉదయశ్వరరావు, చింతలపూడి ప్రసాద్ రాజు, రాజశేఖర్, జయరాజు, రాంబాబు, అన్వర్ భాష, కాగిత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యమే లక్ష్యం

**- చింతపల్లిలో అంతర్జాతీయ యోగ అవగాహన ర్యాలీ**

**- ఎంపీడీఓ శ్రీనివాసరావు**




**చింతపల్లి, మే 27 (జనస్వరం) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ యూవీఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ కూడలి వరకు వైభవంగా వెళ్లిన ఈ ర్యాలీలో అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, సచివాలయాల వారిగా యోగ మాస్టర్ ప్లాన్ శిక్షణలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు యోగ ప్రయోజనాలు వివరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం యోగ చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ఉదయ సందీప్, యోగ గురువు మోహనరావు, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైరు తగిలి గీత కార్మికుడు మృతి



**కలిదిండి, మే 27 (జనస్వరం) :** విద్యుత్ వైర్ తగిలి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన కలిదిండి మండలం కొండూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన కట్టా రంగారావు (65) అనే వ్యక్తి తన వృత్తిలో భాగంగా మంగళవారం ఉదయం ఓ చెరువు గట్టుపై ఉన్న కొబ్బరి చెట్టు మట్టలను కొట్టడానికి వెళ్ళగా, ప్రక్కనే ఉన్న కరెంటు వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కలిదిండి ఎస్ఐ సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పాసైన విద్యార్థినిని ఫెయిల్ చేశారు



**పులివెందుల, మే 27 (జనస్వరం) :** పదో తరగతిలో ఓ విద్యార్థిని పాసైనప్పటికీ ఫెయిల్ అయిన ఉదంతం కడప జిల్లా ఎర్రగుంట్లలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఎర్రగుంట్ల హైస్కూల్లో జి. మోక్షిత పదో తరగతి చదివింది. మార్చిలో పరీక్షలు రాయగా అన్ని సబ్జెక్టుల్లో 90శాతం మార్కులు వచ్చాయి. సోషల్లో 21 మార్కులే రావడంతో రీవాల్యుయేషన్ చేయించారు. ఈక్రమంలో ఆమెకు 84 మార్కులు వచ్చాయి. కొందరి నిర్లక్ష్యంతో తాను ఐఐటీ, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో చేరే అవకాశం కోల్పోయానని మోక్షిత ఈ సందర్భంగా వాపోయింది.

# టీడీపీ ఆవిర్భావం తర్వాతే పేదల జీవితాల్లో వెలుగులు

- కడప మహానాడుకి హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్
- ఎంపీ హోదాలో మొదటిసారి మహానాడుకి హాజరు
- మహానాడు ఆర్థిక వనరుల కమిటీలో ఎంపీ కేశినేని శివనాథ్ సభ్యుడు
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఎంపీ కేశినేని శివనాథ్
- మహానాడు ప్రాంగణానికి కాలిబాటన చేరుకున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, వెనిగండ్లరాము
- మహానాడు ప్రాంగణంలో తన పేరు రిజిస్టర్ చేయించుకున్న ఎంపీ కేశినేని
- తన నియోజకవర్గ ఎమ్మెల్యేలతో కలిసి ప్రాంగణంలో ఎంపీ కేశినేని సందడి
- మహానాడు ప్రాంగణంలోని ఎన్టీఆర్ జిల్లా కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం నింపిన ఎంపీ కేశినేని
- సీఎం చంద్రబాబే టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా మహానాడులో తీర్మానం
- మంత్రి లోకేష్ సమర్థత, సామర్థ్యం గల నాయకుడు, పదవికే వన్నె తెచ్చే నాయకుడు



**విజయవాడ/కడప, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో పేద వారి జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నేడు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కడప శివారు ప్రాంతమైన చెర్లోపల్లిలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎంపీ హోదాలో తొలిసారి హాజరయ్యారు. మహానాడు ప్రాంగణానికి వెళ్లే దారులు ట్రాఫిక్ జామ్ కావటంతో ఎంపీ కేశినేని శివనాథ్‌తోపాటు ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, వెనిగండ్ల రాము కాలిబాటన మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రాంగణంలో ఎంపీ కేశినేని శివనాథ్ తన పేరు రిజిస్ట్రర్ చేయించుకొని మహానాడు కిట్ అందుకున్నారు. మహానాడు ప్రాంగణానికి చేరుకున్న ఎంపీ కేశినేని శివనాథ్‌కి ఎన్టీఆర్ జిల్లా తెలుగు తమ్ముళ్లు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్‌లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎంపీ వ్యవస్థాపక అశ్యక్షుడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా నిర్వహించే మహానాడు ఈ సారి కడపలో నిర్వహించటం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన తెలుగుతమ్ముళ్ళు, నాయకులు, కార్యకర్తలతో కడప నగరం బంతిపూల వనంగా మారిందన్నారు. తెలుగుప్రజల ఆత్మగౌరవం నినాదంతో ఆంధ్ర ప్రదేశ్‌కి దేశవ్యాప్తంగా ఎన్టీఆర్ గుర్తింపు తీసుకువస్తే, తెలుగు ప్రజల ఆత్మవిశ్వాసంతో ఏ పనైనా దిగ్విజయంగా పూర్తి చేస్తారని ప్రపంచ స్థాయిలో తన విజనరీతో రాష్ట్రానికి గుర్తింపు తీసుకు వచ్చిన నాయకుడు సీఎం చంద్రబాబు అని కొనియాడారు. మహానాడు ఆర్థిక వనరుల కమిటీలో సభ్యుడిగా వున్న ఎంపి కేశినేని శివనాథ్ మహానాడు ప్రాంగణంలో లక్షలాదిగా తరలివస్తున్న నాయకులు, కార్యకర్తల కోసం చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి సీఎం చంద్రబాబును ఎన్నుకునే విధంగా ఈ మహానాడు తీర్మానం చేయబోతున్నట్లు తెలిపారు. అదే విధంగా మంత్రి నారా లోకేష్ పార్టీ అత్యున్నత పదవి లభించాలని పార్టీ శ్రేణులతో పాటు రాష్ట్ర ప్రజలకు కోరుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌కి ఏ పదవి కేటాయించినా ఆ పదవికే వన్నె తీసుకువస్తాడన్నారు. టీడీపీకి కోటి మంది కార్యకర్తలను సభ్యులుగా చేర్పించి మంత్రి నారా లోకేష్ ఒక రికార్డ్ క్రియేట్ చేశాడన్నారు. మంత్రి నారా లోకేష్ విషయంలో ఈ మహానాడులో టీడీపీ శ్రేణుల ఆశ తీరుతుందనే ఆశాభావం ఎంపి కేశినేని శివనాథ్ వ్యక్తం చేశారు.

## వంగసారలో అంగన్వాడి భవనానికి శంకుస్థాపన

**పెదబరడ సర్పంచ్ గోపాల్**



**చింతపల్లి, మే 27 (జనస్వరం) :** మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని వంగసార పెద్ద వీధి గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణానికి మంగళవారం ఆ పంచాయతీ సర్పంచ్ సమీడి గోపాల్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ భవనం నిర్మాణం పూర్తయితే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సురక్షిత వాతావరణంతో పాటు వసతి సదుపాయాలు కలుగుతాయి. అంతేకాకుండా, అంగన్వాడి కార్యకలాపాలకు అవసరమైన సామగ్రి భద్రపరచడానికి ఇది ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. భవనం చుట్టుపక్కల పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మి కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దేవి ప్రియ, కూటమి నాయకులు గెమ్మెలి అబ్బాయి నాయుడు, కేశవ్, వార్డు సభ్యుడు పి.లక్ష్మణ్, కే.నాయుడు, కే.సతీష్, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృద్ధుడిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి**



**చింతపల్లి, మే 27 (జనస్వరం) :** మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని బయలుకించంగి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం విషాదాంతంగా ముగిసింది. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ నడింవాడ (గుండాలగరువు) గ్రామానికి చెందిన తెరవాడ బాబు రావు ద్విచక్ర వాహనంపై చింతపల్లిలోని శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్న సమ యంలో, బయలుకించంగి గ్రామంలో ఓ వృద్ధుడిని బలంగా ఢీకొన్నాడు. ఆ వృద్ధుడు జి మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ వనబంగిపాడు గ్రామానికి చెందిన తాంగుల బొజ్జయ్య (70) కాగా, అప్పట్లో ఆటో నుంచి దిగిపోతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో బొజ్జయ్య కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు అతన్ని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కింగ్ జార్జి ఆసుపత్రికి (కేజీహెచ్) తరలించారు. అయితే చికిత్స పొం దుతూ బొజ్జయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బొజ్జయ్య బయలుకించంగి గ్రామంలో పాస్టర్‌గా సేవలందిస్తున్నాడు. అనంతరం స్వగ్రామమైన వనబంగిపాడులో కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీనియర్ పాత్రికేయుడు యేసురత్నం ఇకలేరు

**పాత్రికేయ రంగానికి తీరని లోటు**



**చింతపల్లి, మే 27 (జనస్వరం) :** స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సీనియర్ పాత్రికేయుడు గుండుమళ్ళ యేసురత్నం (58) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. గత 15 ఏళ్లుగా చింతపల్లిలోని వివిధ దినపత్రికలకు పాత్రికేయుడిగా సేవలందించిన ఆయన, వృత్తిలో నిబద్ధతతో పాటు ప్రజా సమస్యలపై పట్టుదలతో కలం పట్టి ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు. సామాజిక అంశాలపై తన నివేదికల ద్వారా అనేక మార్పులకు నాంది పలికిన యేసురత్నం అనేక విభిన్న అంశాలపై ధైర్యంగా రాసిన వార్తలతో స్థానికంగా చర్చనీయాంశంగా నిలిచారు. ఆయన మృతిపై స్థానిక పాత్రికేయ సంఘాలు, సన్నిహితులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యేసురత్నం మృతితో పాత్రికేయ వృత్తికి తీరని లోటు ఏర్పడిందని వారు విచారం వ్యక్తం చేశారు. తీవ్ర అనారోగ్యంతో మంగళవారం ఉదయం ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ అదే రోజు మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యుల్లో ఆయనకు ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు.

## "మహానాడు"లో సీతారామపురం మండల టీడీపీ నాయకులు



**నెల్లూరు, మే 27 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లాలో టీడీపీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి సీతారామపురం మండల టీడీపీ నాయకులు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలతో కలిసి మహానాడుకు హాజరయ్యారు. అనంతరం అక్కడ రాష్ట్ర మంత్రులు కార్పొరేషన్ చైర్మన్‌లతో అలాగే సీనియర్ మంత్రులతో కలిసి కొంతసేపు చర్చించారు. అలాగే మహానాడులో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, నేలటూరి జాషువా, జెసి ఇజ్రాయిల్, కానాల సిద్దయ్య, ముత్తూరు సుమన్ తదితరులు పాల్గొన్నారు

## శిశువుల ఆరోగ్య రక్షణకు టీకాలు కీలకం

- ప్రాంతీయ ఆసుపత్రిలో సుఖప్రసవాల మెరుగుదలపై దృష్టి పెట్టండి
- అల్లూరి జిల్లా ఇమ్యూనైజేషన్, ప్రోగ్రాం మేనేజ్మెంట్ అధికారి డా. కిరణ్ కుమార్



**చింతపల్లి, మే 27 (జనస్వరం) :** స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా ఇమ్యూనైజేషన్, ప్రోగ్రాం మేనేజ్మెంట్ అధికారి డా. ఎం.కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ప్రసూతుల నిర్వహణ, శిశువులకు టీకాలు వేసే విధానం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బందితో మాట్లాడిన ఆయన శిశువుల ఆరోగ్య పరిరక్షణలో వ్యాక్సినేషన్ అత్యంత కీలకం. టీకాల వల్ల వారు ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ పొందుతారు. ప్రతి శిశువుకూ తగిన సమయంలో వ్యాక్సినేషన్ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సుఖప్రసవం అనంతరం శిశువులకు విటమిన్ కె, బిసీజీ, హెపటైటిస్–బి టీకాలు తప్పనిసరిగా స్టాఫ్ నర్స్ లేదా వైద్య సిబ్బంది అందించాలన్నారు. అంతేకాకుండా, తల్లిదండ్రులకు వ్యాక్సినేషన్‌పై సరైన అవగాహన కల్పించడం వైద్య సిబ్బంది బాధ్యతగా ఉందని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ప్రసూతి వార్డులు, మందుల నిల్వలు, రికార్డులు వంటివి పరిక్షించారు. కార్యక్రమంలో యువిన్ జిల్లా కోఆర్డినేటర్ కె. ప్రసన్న దత్తా, ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ మండల కన్వీనర్ జన్మదిన వేడుకలు

**ప్రజా ప్రెస్ క్లబ్లో వేడుకలకు హాజరైన స్నేహిత బృందం**



**తనకళ్ళు, మే 27 (జనస్వరం) :** మండల కేంద్రంలోని స్థానిక ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మండల జనసేన పార్టీ మండల కన్వీనర్ కె.వి రమణ జన్మదిన వేడుకలను అత్యంత సన్నిహితుల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసైనికులు మాట్లాడుతూ ఆపదలో ఎన్ని కష్టాలు ఉన్న నేనున్నానని మండల వ్యాప్తంగా తిరిగి పార్టీ విజయానికి కృషి చేసినటువంటి జనసేన మండల పార్టీ నాయకులకు ముఖ్యంగా ఈరోజు పుట్టినరోజు జరుపుకున్నటువంటి జనసేన మండల అధ్యక్షులు ఏవి రమణ పుట్టినరోజు వేడుకలు ప్రజా ప్రెస్ క్లబ్‌లో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకొని, భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించి ముందుకు వెళ్లాలని తోటి జనసైనికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ హాస్పిటల్ చైర్మన్ బుగుడే గోవిందు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ సోంపాల్యం, రజక సాధికార సంఘం డివిజన్ అధ్యక్షులు మీరాసి వేమనారాయణ, నాగభూషణ, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, స్నేహితులు ప్రసాద్ రెడ్డి జక్కా, ముత్యాల రమేష్, పృథ్వి, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

## యోగా మానసిక ప్రశాంతత, శక్తిని పెంచడంలో సహాయపడుతుంది

**పెదపాడు ప్రాజెక్ట్ ఏసీడీపీఓ ఎం.సునీల్ రాజశేఖర్**




**దెందులూరు, మే 27 (జనస్వరం) :** యోగా మానసిక ప్రశాంతత, శక్తిని పెంచడంలో సహాయ పడుతుందని, క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు అని పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీఓ ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు పరిధిలో కొవ్వలి గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు ఏసీడీపీఓ ఎం.సునీల్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21 వరకు ఈ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారని, ప్రతిరోజు యోగా చేయాలని, యోగా చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సచివాలయం సిబ్బంది వి.అన్నపూర్ణ, బి.ప్రమీల, అంగన్వాడీ కార్యకర్త డి.నాగవేణి, సహాయకులు ఎన్ జ్యోతి కిషోరి, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు రుణపడి ఉంటాను

- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్
- ఎన్టీఆర్ జయంతిని అధికారిక కార్యక్రమంగా ప్రకటన
- జీఓ నెం 54 విడుదలను హర్షంగా స్వాగతించిన తెలుగు శక్తి సంస్థ



**విశాఖపట్నం, మే 27 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి, తెలుగు సినీ జగత్తు గొప్ప తారక రాముడు నందమూరి తారక రామారావు జయంతిని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలన్న తన దీర్ఘకాల కోరిక నెరవేరిందని తెలుపుతూ, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 54ను విడుదల చేసి మే 28వ తేదీని అధికారికంగా ఎన్టీఆర్ జయంతిగా నిర్వహించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంద ర్భంగా విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన బి.వి. రామ్, గత 34 రోజులుగా ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిరంతర పోరాటం చేసిన విషయం గుర్తు చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సహా పలువురు ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశామని, మీడియా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. "ఈ విజయాన్ని ఎంతో గర్వంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆయన చొరవ వల్లే ఈ కోరిక నెరవేరింది. ఇది నా మొదటి కోరిక, చివరి కోరిక కూడా," అంటూ భావోద్వేగంగా స్పందించారు. "తెలుగు ప్రజలు ఉన్నంత కాలం, ఎన్టీఆర్ అనే మహానుభావుడి సేవలు, సాంస్కృతిక వారసత్వం చిరస్థాయిగా గుర్తుంచుకుం టారు," అని ఆయన అభిప్రాయపడ్డారు.

## కడప క్రికెట్ స్టేడియం అభివృద్దికి కృషి చేస్తా

- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఘనంగా సన్మానించిన కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్
- కడప క్రికెట్ స్టేడియం సందర్శన



**విజయవాడ/కడప, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కడప క్రికెట్ స్టేడియంలో జాతీయ క్రికెట్ మ్యాచులు జరిగే విధంగా చర్యలు తీసుకోవటంతో పాటు, స్టేడియం అభివృద్దికి కృషి చేస్తానని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి కడప పుట్టంపల్లె లోని కడప క్రికెట్ స్టేడియాన్ని మంగళవారం సందర్శించారు. కడప స్టేడియాన్ని విచ్చేసిన ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ కి కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, సెక్రటరీ రెడ్డి ప్రసాద్, స్టేడియం కన్వీనర్ సంజయ్ కుమార్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఎంపి కేశినేని శివనాథ్ తో పాటు ఎమ్మెల్యే వెనిగండ్ల రామును శాలువాతో సత్కరించారు. ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కడప క్రికెట్ స్టేడియం అంతా పరిశీలించారు. క్రీడాకారులు, సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. వారికి కావాల్సిన సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు అనుగుణంగా అన్నీ సౌకర్యాలు కల్పించామనీ, మరిన్నీ మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.


## కడప జిల్లాపై చంద్రబాబుకు కక్ష ఎందుకో..?



**పులివెందుల, మే 27 (జనస్వరం) :** ముఖ్యమంత్రి చంద్రబాబుకు కడప జిల్లాపై కక్ష ఎందుకని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. పులివెందులలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు జిల్లాకు పైసా నిధులు విడుదల చేయలేదన్నారు. అలాంటప్పుడు కడప నగరంలో మహానాడు నిర్వహించడం అంటే జిల్లా ప్రజలను అవమానించడమేనన్నారు. మహానాడుకు జిల్లాలోని అధికార వ్యవస్థ అంతా అక్కడే విధులు నిర్వహించడం శోచనీయమన్నారు. ప్రజలకు ఏమి చేశావని కడపలో మహానాడు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడ ఇంత వరకు అమలు కాలేదని చెప్పారు. రైతులకు ఇచ్చే రైతు భరోసా, తల్లికి వందనం, ఆడబిడ్డ పథకం, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఎడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేదని చెప్పారు. వేంపల్లెలో రోడ్లు పరిస్థితి చాలా అధ్వానంగా మారిందని, కూటమి నాయకులు వస్తారు.. పనులకు టెంకాయలు కొడతారు.. వెళ్లిపోతారు.. పనులు మాత్రం జరగవన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో కూడ పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందన్నారు. కడపకు ఏమీ చేశావని 5 లక్షలు జనాలతో మహానాడు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు భజన కొట్టడం తప్పా ఏమీ లేదన్నారు. ఓట్లు వేసిన ప్రజల కోసం పాటు పడకుండా కూటమి నాయకుల కోసం పాటు పడడం దుర్మార్గమన్నారు. పులివెందులలో స్టేడియం పనులు పూర్తి అయిన ఇంత వరకు కూటమి నేతలు ఒక మ్యాచ్ కూడ ఆడిచలేదని దుయ్యబట్టారు. కడప పైన సవతి ప్రేమ చాలించి కన్న తల్లి ప్రేమ చూపించాలని లేని పక్షంలో పీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి సహకారంతో పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, డీసీసీ అద్యక్షురాలు విజయ జ్యోతిల ఆధ్వర్యంలో టీడీపీ అఫిసులను ముట్టడి చేస్తామని ధ్రువకుమార్ రెడ్డి హెచ్చరించారు.

## గుండుగొలులో నూతన 33/11 కె.వి. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం

- రైతులకు, ప్రజలకు విద్యుత్ అంతరాయం నుండి విముక్తి
- ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



**భీమడోలు, మే 27 (జనస్వరం) :** మండలంలోని గుండుగొలను సబ్ స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కె.వి. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మంగళవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గుండుగొలు గ్రామ ప్రజలు తరచూ విద్యుత్ అంతరాయం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది సాగు, గృహ అవసరాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకున్నాం," అని తెలిపారు. ప్రత్యేకంగా రైతుల సాగు అవసరాలకు, రాబోయే వానాకాలం సాగుకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషిలో భాగంగా ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయబడిందని, ఇదే ఉద్దేశంతో మరోపాటి మౌలిక వసతుల అభివృద్ధికీ కృషి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత

ఉత్తరాంధ్రపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. అమరావతి పూర్తి చేస్తాం. సాగునీరు ఇవ్వడం ద్వారా సీమ స్థితిగతులు మార్చాలని ఎన్టీఆరే మొదట సంకల్పం చేశారు. కడప, కర్నూలు, అనంత పురం జిల్లాలో ఫ్యాక్షనిజం అంతం చేశాము. తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీనీవా, నగరి గాలేరు, ముచ్చుమర్రి పూర్తి చేసింది టీడీపీనే. సీమ ముఖచిత్రం మార్చిన పార్టీ టీడీపీనే. 30 ఏళ్ల క్రితమే ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ తెచ్చి 90 శాతం సబ్సిడీతో మైక్రో ఇరిగేషన్ ఇచ్చింది టీడీపీనే. గత ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఇరిగేషన్‌కు ఖర్చు పెట్టలేదు. 2014 – 19లో రూ. 12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. హంద్రీనీవా వెడల్పు చేస్తున్నాం. ఈ ఏడాదే పూర్తి చేసి చివరి భూములకు నీరిస్తాం. పోలవరం–బనకచర్లకు శ్రీకారం చుట్టబోతున్నాం. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లుల పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో 5 రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాం. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రాలుగా ప్రతి కుటుంబంలో ఎంట్రప్రెన్యూర్‌ను తయారుచేస్తాం. మండల పార్టీ అధ్యక్షులు, పార్లమెంటరీ నేతలు, క్లస్టర్ ఇన్ చార్జులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సమర్థ నాయకత్వాన్ని తయారుచేసుకోవాలి. శక్తి పెంచుకోవాలి. మనది పొలి టికల్ గవర్నెన్స్. ప్రతి కార్యకర్త ఈ ప్రభుత్వంలో భాగస్వామి అయ్యి వారి ద్వారా పాలన జరిగినప్పుడు నిజమైన పొలిటికల్ గవర్నెన్స్ సాధ్యం. ప్రభు త్వానికి, పార్టీకి అనుసంధానం పెరగాలి. దానికి మహానాడు ఒక వేదిక కావాలి. మహానాడు ద్వారా ఒకటే చెబుతున్నాను. ఏపీని, తెలుగుజాతిని నెంబర్ వన్ చేసే వరకూ నిరంతరం పనిచేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**పహల్గాం మృతులు, వీర సైనికులకు నివాళి :**

మరోవైపు మహానాడుకు వచ్చిన టీడీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్ర బాబుకు సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలి కారు. అనంతరం ఫోటోగ్యాలరీని తిలకించారు. రక్త దాన శిబిరంలో పాల్గొ న్నారు. అలాగే సభ ప్రారంభమైన తర్వాతపహల్గాం మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో పోరాడి వీరమరణం పొందిన సైనికులకు సంతాపం తెలు పుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అటు తెలుగుదేశం పార్టీలో మరణించిన వారికి కూడా సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## అధికారికంగా ఎన్టీఆర్ జయంతి..

### ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

**అమరావతి, మే 27 (జనస్వరం) :** మే 28వ తేదీన దివంగత నేత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అధికారికంగా ఎన్టీఆర్ జయంతిని నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏపీ సీఎస్ విజయానంద్ జీవోఎంఎస్ నెంబర్ 54ను జారీ చేశారు. దివంగత నేత నందమూరి తారక రామారావు అసాధారణ జీవితం, ఆయన దూరదృష్టి కలిగిన నాయకత్వం, కళాత్మక ప్రతిభ, తెలుగు ప్రజల పట్ల నిబద్ధత ఆంధ్ర ప్రదేశ్‌పై చెరిగిపోని ముద్ర వేశారని తెలిపింది. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం మే 28వ తేదీన ఎన్టీఆర్ జయంతిని 'రాష్ట్ర స్థాయి వేడుకగా' జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తూ ఏపీ సీఎస్ విజయానంద్ జీవో జారీ చేశారు. ఎన్టీ రామారావు తెలుగు ప్రజలకే గర్వ కారణమని ఉత్తర్వుల్లో వెల్లడించింది. సినిమా, రాజకీయాల ద్వారానే కాకుండా తెలుగు ప్రజలకు ఆయన సేవలు చాలా రంగాల్లో విస్తరించాయి. నటన ద్వారా ఎన్టీఆర్ తెలుగు భాష, జానపద సం ప్రదాయాలను పునరుజ్జీవింపజేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, సామాజిక న్యాయం, పరిపా లన వికేంద్రీకరణ, ప్రజాకేంద్రిత పాలన సంస్కరణలను ప్రవేశపెట్టారు. గ్రామీణ పేదల ఆత్మ గౌరవానికి ఎంతో విలువను తెచ్చారు. తెలుగు వారికి జాతీయస్థాయిలో గుర్తింపును ఇచ్చి తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని చాటారు. ఇకపై ప్రతి సంవత్సరం ఆయన జయంతిని గౌరవపూర్వకంగా రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని శాఖలు, శాఖాధిపతులు, కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు అందరూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఏపీ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతిలో కొత్త సాంకేతికతల సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయండి

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి నాదెండ్ల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, మే 27 (జనస్వరం) :** అమరావతిలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ (కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికలు) కోసం ఒక సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రజాపంపిణీ, వినియోగ దారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తమ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) గవర్నింగ్ కౌన్సిల్ 9వ సమావేశం జరిగింది. అనంతరం మనోహర్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరులో మత్స్య, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరి ంచి, ఫుడ్ కంట్రోలింగ్ ల్యాబ్ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు.

## భువనేశ్వర్ విమాన సర్వీస్‌కు వీజీఎఫ్

**విశాఖపట్నం, మే 27 (జనస్వరం) :** విశాఖపట్నం–భువనేశ్వర్ మధ్య వచ్చే నెల 12వ తేదీ నుంచి కొత్త విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. దీనిని ఇండిగో సంస్థ నడుపనుంది. ఒకవేళ ఆక్యుపెన్సీ తక్కువగా ఉండి ఆ సంస్థకు ఏమైనా నష్టాలు వచ్చినట్టయితే 'వయబులిటీ గ్యాప్ ఫండింగ్' (వీజీఎఫ్) ద్వారా భర్తీ చేయడానికి ఒడిశా ప్రభుత్వం అంగీకరించింది. దీనికి కృషిచేసిన ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును ఏపీ విమాన ప్రయాణికుల సంఘం (అపాటా) ప్రతినిధులు నరేశ్‌కుమార్, కాశీవిశ్వనాథరాజు, డీఎస్ వర్మ భువనేశ్వర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విమాన సర్వీస్ ప్రతిరోజూ విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.55 గంటలకు వచ్చి, తిరిగి 2.25 గంటలకు బయలుదేరి భువనేశ్వర్ వెళుతుంది. వారానికి నాలుగు రోజులు నడిచే అబుదాబి విమానం జూన్ 13 నుంచి ప్రారంభమవుతుందని, ఇది ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం వచ్చి, తిరిగి ఇక్కడి నుంచి 9.50 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు.

## కుట్రలో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్లకూ పాత్ర

### టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 127వ నిందితుడిగా చేర్చిన సీఐడీ

**గుంటూరు, మే 27 (జనస్వరం) :** టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికుట్రలో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాత్ర కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆయన్ను ఈ కేసులో 127వ నిందితుడిగా చేర్చారు. టీడీపీ ఆఫీస్‌పై దాడికి వైసీపీ ముఖ్య నేతలు కుట్ర చేసినట్లు ఇప్పటికే తేలిన విషయం తెలిసిందే. కుట్రదారుల్లో సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, నందిగం సురేశ్, దేవినేని అవినాశ్, న్యాయవాది గవాస్కర్‌లతో పాటు మరికొందరు ఉన్నారు. ఆ జాబితాలో రామకృష్ణారెడ్డి చేరారు. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చాల్సి వస్తే ముందుగా నోటీస్ ఇచ్చి విచారించాలని ఆయన గతంలో కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సీఐడీ అధికారులు ఆయన్ను 127వ నిందితుడిగా చేర్చారు. త్వరలోనే విచారణకు రావాలని నోటీసులు జారీ చేయనున్నారు. మరోవైపు కొందరు నిందితులు అరెస్ట్ నుంచి కోర్టు ద్వారా రక్షణ పొందిన నేపథ్యంలో వారందరికీ నోటీసులు జారీ చేయడంతో పాటు కేసు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు.

## భూ వివాదాల్లో పోలీసుల జోక్యం వద్దు




**అమరావతి, మే 27(జనస్వరం) :** సామరస్యపూర్వక పరిష్కారం పేరుతో పోలీసులు భూవివాదాల్లో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రీ లిటిగేషన్ కౌన్సిల్ ఫోరమ్ (పీఎల్‌సీఎఫ్) పేరుతో సివిల్ వివాదాలతో సంబంధం ఉన్న వ్యక్తులను విశాఖ పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. భూవివాదాల పరిష్కారం విషయంలో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు.

**దావా ఉపసంహరణకు ఒత్తిడి చేయవద్దు :**

దర్శి కోర్టులో తాను దాఖలు చేసిన దావాను ఉపసంహరించుకోవాలని ప్రకాశం జిల్లా ముండ్లమూరు పోలీసులు ఒత్తిడి చేస్తున్నారంటూ బసవపురానికి చెందిన కె.వెంకటరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు దావాను ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌ను ఒత్తిడి చేయవద్దని పోలీసులను ఆదేశించింది.

# పులివెందులలో 'బొబ్బిలిపులి' ఆడియో విడుదల

- ప్రజల చైతన్యం కోసం చైతన్య యాత్ర ప్రారంభం
- ప్రభుత్వాలు ప్రజల కోసమే పనిచేయాలి
- బివి రామ్, తులసి రెడ్డి



**వేంపల్లి, మే 27 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లిలో మంగళవారం 'బొబ్బిలి పులి' ఆడియోను వైభవంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ మాట్లాడుతూ, "బొబ్బిలిపులి ఆడియో ప్రజల్లో చైతన్యం కోసం రూపొందించాం. ప్రజలను ప్రశ్నించే స్థితికి తీసుకు రావాలనే లక్ష్యంతో ఈ చైతన్య యాత్ర మొదలైంది" అన్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర్యం వచ్చినా ప్రజలు ఇంకా బానిసలుగా బతుకుతున్నారని, ప్రభుత్వాలు వారిని బిచ్చగాళ్లుగా మార్చాయని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా, కుల మతాలకతీతంగా సేవలందించాలని, ప్రజల కోసం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని బివి రామ్ పేర్కొన్నారు. "నేను మంచివారికే కొమ్ముకాస్తాను. ప్రజల్లో మార్పు రావాలి. ఏ నియోజకవర్గంలో చూసినా ప్రజలు సంతోషంగా లేరు. అధికారుల మైండ్‌సెట్ కూడా మారాలి. ప్రజలే తమ పన్నులతో అధికారులకు జీతాలు ఇస్తున్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి," అని హితవు పలికారు. ఇక ఏదో ఒకరు వచ్చి మార్పు తేవాలని ఎదురు చూడకుండా, అన్యాయాన్ని ఎదిరించడంలో ప్రజలే ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. "బొబ్బిలిపులి ఆడియో ద్వారా ప్రజల్లో ప్రశ్నించే శక్తిని నింపాలనుకుంటున్నా. పిల్లల భవిష్యత్తు కోసం తాయిలాలు ఇచ్చే అభ్యర్థులను తిరస్కరించాలి," అని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ, "బొబ్బిలిపులి జైత్రయాత్రకు నా పూర్తి మద్దతు తెలుపుతున్నా. సమాజ శ్రేయస్సు కోసం బి.వి. రామ్ చేపట్టిన ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటున్నా," అన్నారు. ఆడియో విడుదలకు ముందు చక్రాయపేట మండలంలోని గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో బి.వి. రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎం.వి. బాలిరెడ్డి, తిరుపాల్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, వేమరాజు, వెంకటేశు, వేమయ్య, నాగరాజు, అమర్, ఉత్తన్న, దేవత నాగరాజు, ధ్రువ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కడప మహానాడులో తెలుగు శక్తి చొరవ :**

ఆడియో విడుదల అనంతరం కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా చైతన్యానికి బొబ్బిలిపులి యాత్ర, తెలుగు శక్తి ఉద్యమం కలిసి సాగనున్నాయని బివి రామ్ తెలిపారు.

## యలమంచిలిలో 200 మంది ట్రైనర్లకు మాస్టర్ యోగ శిక్షణ

### ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా 'యోగాంధ్ర'లో భాగంగా ప్రత్యేక శిక్షణ శిబిరం



**యలమంచిలి, మే 27 (జనస్వరం) :** ప్రపంచ యోగ దినోత్సవం – 2025 ను పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మంగళవారం యలమంచిలి పురపాలక సంఘ పరిధిలో 200 మంది యోగ ట్రైనర్లకు మాస్టర్ ట్రైనర్ లచే శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గౌరవ శాసనసభ్యులు, పురపాలక సంఘ చైర్పర్సన్ ఆధ్వర్యం వహించారు. కమిషనర్ ప్రసాద్ రాజు మాట్లాడుతూ, మే 21వ తేదీ నుంచి ప్రారంభమైన యోగ మాస ఉత్సవాలు జూన్ 21వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. మాస్టర్ ట్రైనర్లచే ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం ఐదు రోజులపాటు జరగనుందని, ఇందులో శిక్షణ పొందే ప్రతి ట్రైనర్ దాదాపు 50 మందికి యోగాభ్యాసం నేర్పే బాధ్యత వహిస్తారని తెలిపారు. ఇక యోగంపై ప్రజల్లో మరింత ఆసక్తి పెంచేందుకు ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో యోగ కాంపిటిషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కమిషనర్ కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మల్ల రాము ప్రత్యేకంగా ట్రైనర్లకు యోగ సూత్రాలను, ప్రాథమిక ధ్యాన విధానాలను బోధించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బంది తదితరులు చురుకుగా పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరం యలమంచిలిలో ఆరోగ్యవంతమైన జీవనశైలి పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ముఖ్యమైన దశగా నిలుస్తుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

## మహానాడులో ఉక్కు పరిశ్రమపై ప్రకటన చేయాలి

### పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాసరెడ్డి



**పులివెందుల మే 27 (జనస్వరం) :** కడపలో నిర్వహిస్తున్న మహానాడులో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రకటన చేయాలని పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన సందర్భంగా కడపలో సెల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అప్పటి యూపీఏ ప్రభుత్వం చట్టంలో పొందించారన్నారు. దురదృష్టవ శాత్తు కాంగ్రెస్ పార్టీ అప్పట్లో అధికారంలోకి రాలేదన్నారు. విభజన సందర్భంగా అప్పటి ప్రతిపక్ష బీజేపీ తాము అధికారంలోకి రాగానే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు ఆంధ్రప్రదేశ్ కు పది సంవ త్సరాలపాటు పాటు ప్రత్యేక హెూదా కల్పిస్తామని పార్లమెంటులో హామీ ఇచ్చారన్నారు. బీజేపీ ప్రభు త్వం అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయినా అటు ఉక్కు పరిశ్రమ ఇటు ప్రత్యేక హెూదా లేదన్నారు. 2014 లో టీడీపీ, 2019లో వైసీపీ అధికారం చేపట్టినా విభజన అంశాలను పూర్తిగా విస్మరించారన్నారు. ఆ రెండు పార్టీలు మోదీ చేతిలో కీలుబొమ్మలుగా తయారయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. 11 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఉక్కు ప్రస్తావన లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 11 ఏళ్ళు పూర్తవుతున్న అభివృద్ధిలో శూన్యం అన్నారు. కానీ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మహానాడు నిర్వహించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా మహానాడులో కడప ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

## తొలిరోజు రూ.22.28 కోట్ల విరాళాలు

**కడప, మే 27 (జనస్వరం) :** కడప మహానాడులో తెలుగుదేశం పార్టీకి సోమవారం రూ.22.28 కోట్లు విరాళంగా వచ్చాయని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారు. విరాళాలు ఇచ్చిన వారి పేర్లను మహానాడు వేదికపై చంద్రబాబు చదివి వినిపించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.5కోట్లు, పి.నారాయణ రూ.కోటి, టీజీ భరత్ రూ.కోటి, సానా సతీశ్ రూ.1.16కోట్లు, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాజగోపాల్ రూ.50లక్షలు, లక్ష్మీ వెంకటేశ్వర మెటల్ ఇండస్ట్రీస్ రూ.50లక్షలు, దామచర్ల జనార్దన్ 25లక్షలు, వేమన సతీశ్ 25లక్షలు, రవీంద్ర 25లక్షలు ఇచ్చారన్నారు. మొత్తం రూ.22.53కోట్లు పార్టీకి విరాళంగా వచ్చాయన్నారు. విరాళాలు ఇవ్వాలనుకునేవారు 'తెలుగుదేశం పార్టీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జూబ్లీహిల్స్ బ్రాంచి, అకౌంట్ నంబరు 18090200001238"కు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు.

## మహా రుచులు

- టీడీపీ ప్రతినిధులకు నోరూరించే రాయలసీమ వంటలు
- తొలిరోజు 70 వేల మందికి భోజనాలు

**కడప రూరల్, మే 27 (జనస్వరం) :** మహానాడులో రాయలసీమ రుచులతో చక్కటి వంటలను తయారు చేశారు. ఫేమస్ స్వీట్లతోపాటు రకరకాల వెజ్, ఎగ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు. రాయలసీమ స్పెషల్ అట్రాక్షన్‌గా గోంగూర చికెన్ కూడా సిద్ధం చేశారు. 1500 మంది నిపుణులతో వంటలు చేయిస్తున్నారు. తొలిరోజు 50 నుంచి 70 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. వంటకాలను అంబికా క్యాటరింగ్ ఈవెంట్ ఆర్గనైజర్ కిరారు వెంకట శివాజీ చూస్తున్నారు. 2014 నుంచి ప్రతి మహానాడులోనూ ఈయనే వంటలు చేస్తున్నారు. కాగా, మహానాడుకు వచ్చినవారికి స్టేజి సభ్యుల (వీవీఐపీ) భోజన శాల, వీఐపీ భోజనశాల, మీడియా భోజన శాల, జనరల్ కేటగిరీ ఇలా నాలుగు రకాల భోజన శాలలు ఏర్పాటు చేశారు. తొలిరోజు జనరల్ కేటగిరీ భోజన శాలకు కార్యకర్తలు తరలివెళ్లి.. క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో గందరగోళం చోటుచేసుకుంది. ప్లేట్లు చాలక.. సమయానికి భోజనం అందక కాసేపు కార్యకర్తలు అవస్థలు పడ్డారు.

## పశ్చిమ లంకలో మరో ఘోరం

- స్నానానికి దిగిన ముగ్గురు బాలురు గల్లంతు
- ఆచంట మండలం రావిలంక వద్ద ఘటన
- ముమ్మరంగా గాలింపు

**ఆచంట, మే 27 (జనస్వరం) :** పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద గోదావరిలో ముగ్గురు బాలురు గల్లంతయ్యారు. కోనసీమ జిల్లా గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్యతేజ (12), నీతిపూడి పాల్ కుమార్ (15)తో పాటు మరో ఇద్దరు బాలురు మంగళవారం ఇక్కడ స్నానానికి దిగారు. వీరిలో ప్రవీణ్, సూర్యతేజ, పాల్ కుమార్ గల్లంతు కాగా మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. గన్నవరం, ఆచంట రెవెన్యూ, పోలీసు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రవీణ్ పదో తరగతి పరీక్షలు రాశాడు. సూర్యతేజ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పాల్ కుమార్ యలమంచిలి మండలం పెదలంక వాసి. వేసవి సెలవులు కావడంతో బంధువైన సూర్యతేజ ఇంటికి వచ్చాడు. ముగ్గురి కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## వెల్లువెత్తుతున్న ఉత్సాహం

- మహానాడు ప్రతినిధుల సభకు జిల్లా నుంచి భారీగా హాజరు
- వందలాది వాహనాల్లో వెళ్లిన టీడీపీ శ్రేణులు
- చంద్రబాబు, లోకేష్ ప్రసంగాలపై ఆసక్తి
- తొలిరోజు పార్టీ అంశాలపైనే ప్రధాన దృష్టి
- మంత్రి స్వామి నేతృత్వంలో రక్తదాన శిబిరం
- రూ.25లక్షలు విరాళం ఇచ్చిన ఎమ్మెల్యే జనార్దన్




**ఒంగోలు, మే 27 (జనస్వరం) :** తెలుగుదేశం పార్టీ కడప నగర సమీపంలో నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మూడు రోజులపాటు అక్కడ జరగనున్న మహానాడు మంగళవారం ప్రారంభం కాగా ప్రతినిధుల సభ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వందలాది వాహనాల్లో పార్టీ నాయకులు వెళ్లారు. తొలిరోజు ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణ అంశాలు, పార్టీ ప్రాధాన్యతలపై ప్రసంగాలు జరగ్గా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగాలపై జిల్లా నుంచి వెళ్లిన ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. మంత్రి డాక్టర్ స్వామితోపాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఇతర ముఖ్య నేతలు ఒక రోజు ముందుగానే కడప చేరుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాలు, పట్టణాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వందలాది మంది మంగళవారం ఉదయం ఉత్సాహంగా బయల్దేరి వెళ్లారు.

**పెద్దసంఖ్యలో రక్తదానం :**

మహానాడు సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డిఎస్‌బీవీ స్వామి కన్వీనర్‌గా ఉన్న కమిటీ నేతృత్వంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించగా పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు రక్తదానం చేసినట్లు సమాచారం. వారికి మంత్రి స్వామి సర్టిఫికెట్లు అందజేయగా కమిటీలో సభ్యులుగా ఉన్న జిల్లా నేతలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. మరోవైపు మహానాడు విజయవంతం కోసం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూ.25లక్షల విరాళం అందజేశారు. ఆ మహానాడు నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం మీద పార్టీ అధికారంలోకి తిరిగి రావడం, ప్రత్యేకంగా కడపలో నిర్వహిస్తుండటంతో మహానాడుకు పార్టీశ్రేణులు జిల్లా నుంచి ఉత్సాహంగా తరలివెళ్ళారు.

## 10న రాష్ట్రపతి రాక

- గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ద్రౌపది ముర్ము

**విశాఖపట్నం, మే 27 (జనస్వరం) :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే నెల పదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆర్కే బీచ్‌రోడ్డులో గల ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. పదో తేదీ ఉదయం 9.50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టులో గౌరవ వందనం స్వీకరించిన తరువాత 11.40 గంటలకు రోడ్ మార్గాన బయలుదేరి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కన్వెన్షన్ సెంటర్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ వెళతారు.